RNI NO. TELTEL/2022/83470 ●manasakshi.in

# మనసాక్షి మీకోసం

తెలుగు దినపత్రిక ఎడిటర్: మల్లె నాగిరెడ్డి

నల్గొండ హైదరాబాద్ సంపుటి : 4. సంచిక :146 గురువారం 12 ఫిబ్రవరి 2026 పేజీలు 8 వెల: రూ. 1.00 epaper.manasakshi.in



2లో..

## అసెంబ్లీలో సబ్జక్టుపై అవగాహనతో రావాలి

ఆవు కథలు చెప్పి తప్పించుకోరాదు ప్రతిరోజూ అటెండెన్స్ ఉండాల్సిందే ఎమ్మెల్యేలకు సిఎం చంద్రబాబు సూచన

## ఇంటి రుణ గరిష్ఠ కాల పరిమితి 20 ఏళ్లే

అర్బన్ సహకార బ్యాంకులకు ఆర్బీఐ కొత్త నిబంధనలు




హైదరాబాద్:,మనసాక్షి: అర్బన్ సహకార బ్యాంకులు (యూసీబీలు) రుణాల పంపిణీలో తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్బీఐ తెలిపింది.



## ఓటును సద్వియోగం చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి

కొడంగల్ ఫిబ్రవరి 11 మన సాక్షి

సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ పట్టణ కేంద్రంలో 12వ వార్డు బాలుర ఉన్నత పాఠశాలలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తన ఓటు వేయడం జరిగింది.



పట్టణాల్లో ఎక్కువ.. నగరాల్లో తక్కువ పురపాలికల్లో 75.88%... నగరపాలికల్లో 66.05% మొత్తంగా 73% పోలింగ్ ఓటేసిన వారిలో మహిళలే అధికం కార్పొరేషన్లలో అత్యధికంగా నల్గొండలో 77.36%.. అత్యల్పంగా నిజామాబాద్‌లో 59.12% మున్సిపాలిటీల్లో చౌటుప్పల్‌లో 91.91%, నందికొండలో 59.68% నమోదు చెదురుమదురు ఘటనలు మినహా ఎన్నికలు ప్రశాంతం రేపు ఓట్ల లెక్కింపు

# ప్రశాంతంగా మున్సిపల్ ఎన్నికలు

"ప్రజలు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అలాగే విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు.

## ఎన్నికల తీరును పరిశీలించిన కమిషనర్ రమేశ్

హైదరాబాద్,మనసాక్షి: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. మున్సిపల్ ఎన్నికలు నేపథ్యంలో బందోబస్తు, తీరును సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. సీపీ ముందుగా కుత్బుల్లాపూర్ జోన్ లోని మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధి లోని ఎల్లంపేట మున్సిపాలిటీలోని రావెల్ కోల్ జెడ్పీహెచ్ స్కూల్, ఎల్లంపేట జెడ్పీహెచ్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రాల్లో పర్యటించారు. అనంతరం జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధి లోని అలియాబాద్ మున్సిపాలిటీలో ఉన్న లాల్ గడి మలక్ పేట్ జెడ్పీహెచ్ స్కూల్, అలియాబాద్ ఎంపీపీఎస్ పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. అదేవిధంగా శేరిలింగంపల్లి జోన్ లోని పటాన్ చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపాలిటీల లోని ఇంద్రేశం ఎంపీయుపీ స్కూల్, ఇస్నాపూర్ జెడ్పీహెచ్ స్కూల్, చిట్కూల్ ఎంపీపీ స్కూల్ లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

బందోబస్తు విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో మాట్లాడి, భద్రతా పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు.




## మున్సిపోల్స్‌లో రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగం

ఎక్స్ వేదికగా కెటిఆర్ తీవ్ర ఆరోపణలు



హైదరాబాద్:,మనసాక్షి: మున్సిపల్ ఎన్నికల వేళ అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. ఈ క్రమంలో గులాబీ పార్టీ శ్రేణులను ఉద్దేశిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు ఆసక్తికర ట్వీట్ చేశారు. అలానే అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ రేవంత్ రెడ్డి పై కేటీఆర్ ఫైర్ అయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని అరాచకాలు చేసినా వీరోచితంగా పోరాడిన గులాబీ సైనికులందరికీ పేరుపేరునా హృదయపూర్వక అభినందనలు. ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ వరకూ పురపాలక సమరంలో మీరు కనబరిచిన పోరాట స్ఫూర్తి బీఆర్ఎస్‌కు కొండంత బలాన్నిచ్చింది. పార్టీలో ఆకాశమంత ఆత్మవిశ్వాసాన్ని నింపింది. రెండేళ్ల పాలనలో ఘోరమైన పరిపాలనా వైఫల్యాలను మూటగట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్.. ఓటమి భయంతోనే ఈ ఎన్నికల్లో ఇంతటి దౌర్జన్య కాండకు దిగారు. కాంగ్రెస్ పార్టీకి పంచాయతీ ఎన్నికల్లో మొదలైన పరాభవం, పట్టణాల్లోనూ తప్పదనే ఆందోళనతోనే అడుగడుగునా రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు' అని కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అక్రమంగా లూటీ చేసిన వేలకోట్ల ప్రజాధనంతో ప్రజాతీర్పునే మార్చాలన్న ఈ కుట్రలను తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. పోలీసు శాఖను అడ్డంపెట్టుకుని బీఆర్ఎస్ శ్రేణులపై సాగించిన వేధింపుల పర్వానికి, దాడులకు రేవంత్ రెడ్డి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ప్రజలకిచ్చిన హామీలను, మొత్తంగా పరిపాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిన పాపం రేవంత్ రెడ్డిని ప్రతినిత్యం వెంటాడుతూనే ఉంటుంది' అంటూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# థాయి స్కూల్‌లో నరమేధం

దుండగుడి కాల్పుల్లో 34మంది హతం మృతుల్లో 22మంది చిన్నారులు

న్యూఢిల్లీ:,మనసాక్షి: దక్షిణ థాయిలాండ్ లో ఘోరం జరిగింది. బుధవారం మధ్యాహ్నం సోంగ్ఖా హ్యాట్ హెయ్ జిల్లాలోని ఓ పాఠశాలలో ఓ సాయుధుడు కాల్పులకు తెగబడ్డాడు. నిందితుడు జరిపిన కాల్పుల్లో 22మంది చిన్నారులు సహా 34మంది మరణించారు. చాలా మందిని అతను బందీలుగా చేసుకున్నాడు. పాఠశాలలో కాల్పుల మోత వినపడగానే రోడ్డుపై జనాలు ఒక్కసారిగా పరుగులు పెట్టారు. దీనికి సంబంధించిన ఓ వీడియో ఇంటర్నెట్ లో వైరల్ అవుతోంది. సంఘటన గురించి సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అనేక మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల లోపల చిక్కుకున్నారని పోలీసులు తెలిపారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు హాట్ యాయ్ పోలీసులు పాఠశాలను చుట్టుముట్టారు. సాయుధుడితో చర్చలు జరిపేందుకు ప్రయత్నిస్తున్నారు. కాల్పులు జరిపిన వ్యక్తికి 18 ఏళ్ల వయసు ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. పాఠశాల లోపల ఉన్న బందీలను సురక్షితంగా విడిపించేందుకు భద్రతా దళాలు ప్రస్తుతం ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి.

అయితే తరవాత అతను ఆత్మహత్య చేసుకున్నట్లు సమచారం.





## మూడు కార్పోరేషన్లుగా హైదరాబాద్

జలమండలి పరిధి విస్తరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్




హైదరాబాద్, మనసాక్షి: జలమండలి పరిధిని విస్తరిస్తూ తెలంగాణ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసీ)గా విభజించింది. ఈ క్రమంలోనే మూడు కార్పొరేషన్లకు కమిషనర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్ కొనసాగుతుండగా.. సైబరాబాద్‌కు శ్రీజన, మల్కాజ్‌గిరి వినయ్ కృష్ణారెడ్డిలను రాష్ట్ర సర్కార్ నియమించింది. కాగా.. ఓఆర్ఆర్ పరిధిలో నీటి సరఫరా, సివరేజ్ నిర్వహణను జీహెచ్ఎంసీ నుంచి జలమండలికి బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధిని కూడా జలమండలి చేపట్టనుంది. నీటి సరఫరా, మురుగు వ్యవస్థలతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధి కూడా చేపట్టనుంది.



2లో..

## అమెరికాకు తలొగ్గిన భారత ప్రభుత్వం

వాణిజ్య ఒప్పందంతో అమెరికాకే లాభం

ఎన్‌స్టీన్ ఫైల్స్‌లో అనిల్ అంబానీ, హర్దీప్ పురిల ప్రస్తావ

బడ్జెట్ చర్చలో రాహుల్ విమర్శలు

రాహుల్ వ్యాఖ్యలపై గందరగోళం

## మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



2లో..

43 శైవక్షేత్రాలకు 2,243 స్పెషల్ సర్వీసులు

శ్రీశైలం, వేములవాడ, ఏడుపాయల తదితర క్షేత్రాలకు

## అధికార దుర్వినయోగం... ఉల్లంఘనలు

ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు తెగబడటం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని అన్నారు. కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలు, డబ్బు సంచులు, దుష్ట పన్నాగాలు ప్రజల తీర్పును ఏమాత్రం ప్రభావితం చేయలేవని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు.



2లో..



2లో..

## దేశం అభివృద్ధి చెందడాన్ని ఓర్వని కాంగ్రెస్

రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

# అసెంబ్లీలో సబ్జక్టుపై అవగాహనతో రావాలి



అమరావతి: వ్యక్తిగత కక్షల ప్రస్తావనకు అసెంబ్లీని వేదికగా చేసుకోవద్దని కూటమి ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు సూచించారు. సమస్యలను చర్చించి సిద్దంగా ఉండాలన్నారు. సబ్జక్ట్‌పై ప్రిపేర్ రావాలని అన్నారు. ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 నెలలుగా కూటమి నేతల ఐక్యత కొనసాగుతోందని చెప్పారు. కింది స్థాయిలోనూ ఇదే పరిస్థితి ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో 3 పార్టీల నేతలు సమావేశాలు పెట్టుకుంటూ ఐక్యత పెంచుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేల పనితీరుపై అసెంబ్లీ సమావేశాల సమయంలో మాట్లాడతా. 40 మందిని వ్యక్తిగతంగా పిలిపించుకుని మాట్లాడతా. ఆవు కథలు చెప్పడం మాని సబ్జెక్ట్ ప్రిపేర్ అయి సభకు రావాలి. ఎవరేం మాట్లాడుతున్నారో నేనూ నోట్ చేసుకుంటా అని అన్నారు. అసెంబ్లీ జరుగుతున్నప్పుడు ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రతి ఒక్కరూ ఉండాలి. నేను కూడా రోజూ ఉదయం 11 గంటల నుంచి సెషన్ అయ్యే వరకూ అసెంబ్లీలో ఉంటా. సభలో మాట్లాడేది 5 కోట్ల మంది ప్రజలకు జవాబుదారీ అని గుర్తుపెట్టుకోవాలని చంద్రబాబు అన్నారు. అక్కడ ఏం మాట్లాడినా వారి కోసమేనని గ్రహించాలి. అనుకున్న విషయాన్ని 3 నుంచి 7 నిమిషాల్లో మాట్లాడాలి. కూటమి ప్రభుత్వంతో ప్రజలకు జరుగుతున్న లబ్దిని ఎప్పటికప్పుడు చెప్పాలి. రూ.లక్ష కోట్లకు పైగా హైవే పనులు, రూ.90వేల కోట్లకు పైగా రైల్వే పనులు జరుగుతున్నాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో విశాఖ స్టీల్‌ఎ÷-లాంట్ రూ.450 కోట్ల నష్టంలో ఉంది. నష్టాలను అధిగమించి రూ.54 కోట్ల లాభాల్లోకి రావడం శుభపరిణామం.

కేంద్ర ప్రాయోజికత కార్యక్రమాలను రాష్ట్రం అందిపుచ్చుకోవాలి. అన్ని మతాలను గౌరవించాలి.. భక్తుల సెంటిమెంట్‌ను దెబ్బతీయకూడదు. జగన్‌కు మతాలపై గౌరవం లేనందునే వైకాపా హయాంలో రామతీర్థం సహా అనేక ఆలయాలపై దాడులు జరిగాయి. తిరుమల శ్రీవారి లడ్డూతో పాటు ఎక్కడ వీలైతే అక్కడ కల్తీకి పాల్పడ్డారు' అని చంద్రబాబు అన్నారు.

# 24 అజెండా అంశాలకు కేబినేట్ ఆమోదం

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గం సమావేశమై.. 24 అజెండా అంశాలపై చర్చించి ఆమోదం తెలిపింది. నీటి పారుదలశాఖలో 7,189 నిర్వహణ పనులకు పరిపాలనా ఆమోదం లభించింది. భూముల బదిలీకి సంబంధించి చట్ట సవరణ ముసాయిదా బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. గాజువాక రెవెన్యూ గ్రామ పరిధిలో వెయ్యి చదరపు గజాల వరకూ క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును మరో ఆరు నెలలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నివాసాలు ఏర్పరచుకున్న ఆక్రమణల క్రమబద్ధీకరణ దరఖాస్తుల గడువును 30-06-2026 వరకు పొడిగించేందుకు క్యాబినెట్ ఆమోదించింది. కృష్ణా జిల్లా గన్నవరం మండలం కీసరపల్లి గ్రామంలోని సర్వే నం.29/8లోని 3.84 ఎకరాల భూమిని కస్టమ్స్ (ప్రివెంటివ్) కమిషనరేట్ కార్యాలయం, నివాస గృహాల నిర్మాణం' కోసం ఉపయోగించేందుకు అనుగుణంగా గతంలో ఇచ్చిన జీవోలో మార్పు చేస్తూ కేబినేట్ నిర్ణయం తీసుకుంది. ఏలూరు జిల్లా అగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో 45.60 ఎకరాల ప్రభుత్వ భూమిని కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ స్థాపన కోసం కేటాయించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. నంద్యాల జిల్లాలో 1500 ఎకరాల భూమిని 250 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ కోసం కేటాయించనున్నారు. ఎకరాకు ఏటా రూ.31,000 లీజ్ చెల్లించే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్ ఏఐ లివింగ్ ల్యాబ్స్ ప్రారంభానికి, తిరుపతిలో డిజాస్టర్ రికవరీ సెంటర్ ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఇకపోతే అసెంబ్లీకి సంబంధించిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పాలనలో క్రమశిక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధిపై సీఎం స్పష్టమైన దిశానిర్దేశర చేశారు. కేబినెట్ భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు, అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మంత్రుల పనితీరు, ప్రవర్తనపై ఆయన స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చారు. మంత్రులందరూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తప్పనిసరిగా అసెంబ్లీలో ఉండాలని, మధ్యాహ్నం 2 గంటల తర్వాత తమ పేషీల్లో ఉండి ఎమ్మెల్యేల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

# మహాశివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



హైదరాబాద్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. శివరాత్రి సందర్భంగా వివిధ శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు రవాణాపరంగా ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 2,243 స్పెషల్ బస్సులను నడపాలని నిర్ణయించింది. ఈ నెల 15న మహా శివరాత్రి పండుగ ఉండటంతో.. ఈనెల 14 నుంచి 16 వరకు ఈ ప్రత్యేక బస్సులను నడపనున్నారు. ప్రధానంగా శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71 స్పెషల్ సర్వీసులు నడవనున్నాయి. అదేవిధంగా కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ్ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో షామియానాలు, చైర్లు, తాగునీటితోపాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం శివరాత్రికి నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో 1.5 టైమ్స్ వరకు టికెట్ ధరలను సవరించింది. రెగ్యులర్ సర్వీస్ టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ నెల 14 నుంచి 16వ తేది వరకు (మూడు రోజులు) నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15వ తేదీ నుంచి 17 తేదీ వరకు (మూడు రోజులు) సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేస్తుంది.

శివరాత్రి ఆపరేషన్స్‌పై ఉన్నతాధికారులతో సంస్థ వీసీ, ఎండీ శ్రీ వై నాగిరెడ్డి ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. శివరాత్రి పండుగకు శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. గత శివరాత్రి కంటే ఈసారి 208 బస్సులను అదనంగా సంస్థ నడుపుతోంది. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీచేసింది. మహాశివరాత్రి స్పెషల్ బస్సుల్లో (పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో) రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం.. మహిళలకు యథావిధిగా ఉచిత రవాణా సదుపాయం అమల్లో ఉంటుంది. తమ ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని ఆర్టీసీ అధికారులు సూచించారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించామని, టికెట్ల బుకింగ్ ను లిలిలి.బిణబసబిఞశిబిఞ.తిని వెబ్‌సైట్లో బుక్ చేసుకోవచ్చని, మహా శివరాత్రి స్పెషల్ బస్సులకు సంబంధించిన సమాచారం కోసం టీజీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450332లలో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

# అమెరికాకు తలొగ్గిన భారత ప్రభుత్వం



న్యూఢిల్లీ: అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇరు దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అమెరికాకు మేలు కలిగించేలా ఉందే తప్ప.. భారత్‌కు దీనివల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదన్నారు. కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ లోక్‌సభలో మాట్లాడారు. తన ప్రసంగంలో వాణిజ్య ఒప్పందంతో పాటు ఏఐ ప్రభావం వంటి అంశాల గురించి ప్రస్తావించారు. ప్రపంచంలో మారుతున్న పరిణామాలకు అనుగుణంగా బడ్జెట్ ఏమాత్రం ప్రతిబింబించలేదన్నారు. ప్రపంచమంతా ఏఐ యుగంలోకి వెళ్తోందని చెబుతున్నారు. దీనివల్ల భారతీయ ఐటీ కంపెనీలు నష్టపోయే ప్రమాదం ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల ఉద్యోగాలకు ప్రమాదం ఉంది. మన దేశానికి ప్రతిభావంతులైన యువతరం పెద్ద ఆస్తి. ఏఐకి ఇంధనమే డేటా.. డేటా లేకుండా ఏఐ ఏమీ చేయలేదు. అమెరికా సూపర్ పవర్‌గా కొనసాగాలంటే భారత్ డేటానే కీలకం. గతంలో అధిక జనాభాను సమస్యగా భావించేవారు.. కానీ జనాభా మనకు అతిపెద్ద ఆస్తి. కానీ మన డేటాను రక్షించుకునేందుకు ఇండియా చర్యలు తీసుకోలేదు. అమెరికా కంపెనీల కోసం ట్యాక్స్ హాలిడే ప్రకటించిందని రాహుల్ గాంధీ అన్నారు.మన దేశం ఏ దేశాల నుంచి చమురు కొనుగోలు చేయాలో అమెరికా చెబుతోంది. వాళ్లు చెప్పినట్లు చేయకపోతే 50 శాతం టారిఫ్‌లు వేస్తామని బెదిరిస్తున్నారు. అమెరికా డిమాండ్లకు తలొగ్గి కీలక వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ ద్వారాలు తెరిచింది. గతంలో భారత ఉత్పత్తులపై ఒకప్పుడు కేవలం 3 శాతం పన్ను ఉండేది. ఇప్పుడు అది 18 శాతానికి చేరింది. అమెరికా దిగుమతులను 46 బిలియన్ డాలర్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు పెంచేశారు. భారత్‌కు ఈ ఒప్పందం ఎలాంటి భరోసా ఇవ్వడం లేదు. డాలర్‌ను రక్షించుకునేందుకు ఈ ఒప్పందం దోహదపడుతోందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఎప్‌స్టీన్ ఫైల్లో ప్రముఖ పారిశ్రామికవేత్త అనీల్ అంబానీ పేరు వచ్చినా.. ఎందుకు జైలులో పెట్టలేదని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వ్యాపారవేత్త అనీల్ అంబానీ ఎందుకు జైలులో లేదని నేను అడగాలనుకుంటున్నాను? దీనికి కారణం ఆయన పేరు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉంది. అతన్ని (అనీల్ అంబానీ) ఎప్‌స్టీన్‌కు పరిచయం చేసిన హర్‌దీప్ పూరిని కూడా నేను ఒకటి అడగాలనుకుంటున్నాను. అతన్ని ఎవరు పరిచయం చేశారో నాకు తెలుసు. హర్దీప్ పూరికి అతన్ని ఎవరు పరిచేశారో తెలుసు' అని అన్నారు. పరోక్షంగా రాహుల్ మోదీనుద్దేశించి వ్యాఖ్యానించారు. బడ్జెట్‌పై ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ౯ల్స్ గురించి ప్రస్తావన తీసుకురాగా.. స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్‌సింగ్ పూరీ పేర్లను ప్రస్తావించడంపై రవిశంకర్ ప్రసాద్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. దీంతో రాహుల్ గాంధీ వ్యాఖ్యలను రికార్డులను తొలగించాలని స్పీకర్ ఆదేశించారు. బడ్జెట్ గురించి మాత్రమే మాట్లాడాలని స్పీకర్ సూచించారు. పలుమార్లు రాహుల్ గాంధీ మాట్లాడేందుకు ప్రయత్నించగా.. అధికారపక్ష సభ్యుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమెరికాకు తలొగ్గి డేటాను, వ్యవసాయాన్ని, ఇంధన రంగాన్ని అమ్మకానికి పెట్టారంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించి తన ప్రసంగాన్ని ముగించారు.

# మున్సిపోల్స్‌పై పీపుల్స్ పల్స్ సర్వే



**అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ గెలుపు**

**7 కార్పోరేషన్లలో 5 కాంగ్రెస్, 2 బిజెపి గెలుపు**

**పలుచోట్ల ఎంఐఎం కీలకం కానుందని వెల్లడి**

హైదరాబాద్: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు కోలాహలం ముగిసింది. ఉదయం నుంచీ సాయంత్రం వరకూ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు తరలివెళ్లారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసిపోగా.. బూత్ లలో ఉన్న వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. అయితే, ఎన్నికలు ముగిసిన వెంటనే ఎగ్జిట్ పోల్స్ విడుదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు జరిగిన ఈ పోలింగ్‌లో కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకోనుందని పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వే వెల్లడించింది. వారి అంచనాల మేరకు మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబూబ్ నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ జోరు ప్రదర్శించింది. కరీంనగర్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను బీజేపీ కైవసం చేసుకునే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించింది. ఈ రెండు మున్సిపల్ కార్పొరేషన్లలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించనుంది.

నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఎంఐఎం కింగ్ మేకర్ కానున్నదని వెల్లడించింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ ఏ ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ గెలిచే అవకాశాలు లేవని చెప్పింది. ఉత్తర తెలంగాణలో బీజేపీ తన పట్టును నిరూపించుకోనుందని సర్వే చెప్పింది. కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించి, వాటిని కైవసం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయంది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికలు కోలుకోలేని దెబ్బ తీసేలా ఉన్నాయని తెలిపింది.. ఒక్క మున్సిపల్ కార్పొరేషన్‌ను కూడా గెలుచుకునే అవకాశం ఆ పార్టీకి లేదని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది. నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ కార్పొరేషన్లలో అధికార పీఠాన్ని నిర్ణయించడంలో ఎంఐఎం కీలక పాత్ర పోషించనుందని సర్వే వెల్లడించింది.116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ 36శాతం , బీఆర్ఎస్ 29.7శాతం, బీజేపీ 19.3శాతం ఓట్లను సాధించవచ్చని సర్వే పేర్కొంది.

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ 1210-1290 వార్డులను, బీఆర్ఎస్ 860-930 వార్డులను, బీజేపీ 250-270 వార్డులను గెలుచుకునే అవకాశం ఉందని సర్వే చెబుతోంది. మొత్తంగా చూస్తే, అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మొదటి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ తన పట్టును మరింత పటిష్టం చేసుకోగా, బీఆర్ఎస్, బీజేపీలు తమ ఉనికిని కాపాడుకోవడానికి పోరాడుతున్నాయనే విధంగా సర్వే ఫలితాలు వెలువరించింది రామగుండంలో కాంగ్రెస్ 30-34, బీఆర్ఎస్ 16-20, బీజేపీ 3-6, ఇతరులు 4-7 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. మంచిర్యాలలో కాంగ్రెస్ 39-43, బీఆర్ఎస్ 8-12, బీజేపీ 6-9, ఇతరులు 1-2 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. కొత్తగూడెంలో కాంగ్రెస్ 28-34, బీఆర్ఎస్ 7-9, సీపీఐ 14-16, ఇతరులు 2-4 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. మహబూబ్ నగర్ లో కాంగ్రెస్ 26-30, బీఆర్ఎస్ 18-22, బీజేపీ 6-8, ఎంఐఎం 2-4, ఇతరులు 0-1 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. నల్లగొండలో కాంగ్రెస్ 21-26, బీఆర్ఎస్ 8-12, బీజేపీ 6-10, ఎంఐఎం 2-4, ఇతరులు 1-2 వార్డులు గెలుపొందే అవకాశం. నిజామాబాద్ లో కాంగ్రెస్ 10-16, బీఆర్ఎస్ 2-4, బీజేపీ 26-31, ఎంఐఎం 8-12, ఇతరులు 1-2 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. కరీంనగర్ లో కాంగ్రెస్ 14-16, బీఆర్ఎస్ 10-12, బీజేపీ 24-29, ఎంఐఎం 6-9, ఇతరులు 1-3 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది. మొత్తంగా 68-76 మున్సిపాలిటీలను అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోనుంది. 29-36 మున్సిపాలిటీలను ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్, 3-5 బీజేపీ, 0-1 ఎంఐఎం గెలుచుకునే అవకాశం ఉందని పీపుల్స్ పల్స్ తన సర్వే ఫలితాల్లో పేర్కొంది. 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీకి 36 శాతం, బీఆర్ఎస్ కు 29.7 శాతం, బీజేపీకి 19.3 శాతం, ఏఐఎంఐఎంకు 2 శాతం ఓట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని పీపుల్స్ పల్స్ సర్వే తెలిపింది. కాంగ్రెస్ పార్టీ 1210-1290, బీఆర్ఎస్ 860-930, బీజేపీ 250-270, ఏఐఎంఐఎం 35-44, సీపీఐ 12-17, సీపీఎం 10-14, ఇతరులు 90-110 వార్డులు గెలుపొందే అవకాశం ఉందని పీపుల్స్ పల్స్ వెల్లడించింది. దాదాపు 70 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కాంగ్రెస్ కైవసం చేసుకునే అవకాశం ఉందని సర్వే పేర్కొంది. ముఖ్యంగా మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబూబ్ నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగరవేయనుందని సర్వే అంచనా వేసింది.

## దేశం అభివృద్ధి చెందడాన్ని ఓర్వని కాంగ్రెస్

**రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు**

న్యూఢిల్లీ:అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం అభివృద్ధిపథంలో ఉండడాన్ని చూసి కాంగ్రెస్ ఓర్చుకోలేకపోతోందని.. అందువల్లే ఆ పార్టీ నేతలు ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఇరు దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అమెరికాకు మేలు కలిగించేలా ఉందనే ఆధారాలు చూపాలని రాహుల్‌కు సవాల్ విసిరారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడి స్థానానికి తగిన నేత కాంగ్రెస్‌లో లేకపోవడం దురదృష్టకరమన్నారు. రాహుల్ ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పూరీపై లోక్‌సభలో తీవ్రమైన ఆరోపణలు చేశారని రిజిజు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ హక్కులను ఉల్లంఘిస్తూ.. కేంద్రమంత్రిపై చేసిన ఆరోపణలకు గానూ విపక్ష నేతపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు జారీ చేస్తామన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదాలో ఉన్నప్పటికీ రాహుల్ తాను అడిగిన ప్రశ్నలకు ఇతరులు చెప్పే సమాధానాలు వినకుండానే సభ నుంచి వెళ్లిపోతారని మండిపడ్డారు. ఒక సభ్యుడు ప్రసంగం చేసిన వెంటనే సభ నుంచి బయటకు వెళ్లకూడదనే నియమం ఉందని ఆయనకు తెలియదా అని ప్రశ్నించారు.

## అధికార దుర్వినియోగం... ఉల్లంఘనలు

**మున్సిపోల్స్‌పై హరీష్ రావు విమర్శలు**

హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో.. ముఖ్యమంత్రి మొదలు మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అధికార దుర్వినియోగానికి, ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడటం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. నామినేషన్ల దాఖలు మొదలు పోలింగ్ వరకూ కాంగ్రెస్ అనేక అరాచకాలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆక్షేపించారు. బీఆర్ఎస్ అభ్యర్థులను బెదిరించడం, వారిపై భౌతిక దాడులకు తెగబడటం హేయమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమని విమర్శించారు. చట్టాన్ని లెక్కచేయకుండా అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన కొందరు పోలీసుల తీరు గర్హనీయమని ఖండించారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు తెగబడటం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని అన్నారు. కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలు, డబ్బు సంచులు, దుష్ట పన్నాగాలు ప్రజల తీర్పును ఏమాత్రం ప్రభావితం చేయలేవని హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. అధికార పార్టీ అకృత్యాలకు అదరకుండా, బెదరకుండా బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం చివరి వరకు కృషి చేసిన పార్టీ శ్రేణులకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్‌పై విశ్వాసంతో ఓటు వేసిన ప్రతి ఓటరుకు ధన్యవాదాలు చెప్పారు.

# మార్చి 7 వరకు అసెంబ్లీ సమావేశాలు

అమరావతి:ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మార్చి 7 వరకు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. 14 ఆర్థిక మంత్రి బడ్జెట్ సమర్పిస్తారు. అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. మార్చి 7వ తేదీ వరకు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతిరోజూ ఉదయం గం.9:00 నుంచి మధ్యాహ్నం గం.1:30 వరకు ఈ సమావేశాలు జరగనున్నాయి. ఈనెల 14న బడ్జెట్ సమావేశం నిర్వహించనుంది. 15, 16న సెలవులు కాబట్టి 17, 18వ తేదీల్లో బడ్జెట్‌పై చర్చ, 18న రాష్ట్ర పద్దుపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వివరణ ఉంటుంది. 19వ తేదీ నుంచి 8 పనిదినాలు, డిమాండ్ల గ్రాంట్లపై అసెంబ్లీ బీఏసీ చర్చించనుంది ఈ నెల 28న శనివారం నాడు కూడా అసెంబ్లీ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగనున్నాయి. మార్చి 1, 2, 3వ తేదీల్లో అసెంబ్లీకి సెలవు దినాలుగా నిర్ణయించింది. మార్చి 6, 7న బడ్జెట్‌పై మరోసారి చర్చించనున్నారు. ఆ తర్వాత అవసరం మేరకు అసెంబ్లీ సమావేశాలను పొడిగించాలా? వద్దా? అనే విషయమై అసెంబ్లీ బీఏసీ నిర్ణయించనుంది. అసెంబ్లీ సమావేశాల్లో రోజూ జీరో అవర్ నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన నిర్వహించిన బీఏసీ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. 17 రోజులపాటు అసెంబ్లీ కార్యకలాపాలు నిర్వహించనున్నారు. 15 ఆదివారం కాగా.. మహా శివరాత్రి తర్వాత రోజు 16న సెలవు ప్రకటించారు. ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడాపోటీలు నిర్వహించనున్నారు. మార్చి 1, 2, 3 తేదీల్లో అసెంబ్లీకి సెలవు ప్రకటించారు. మార్చి 6న అమరావతిలోనే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సమావేశాలు జరగనున్నాయి. ఉదయం 10 గంటలకు ప్రశ్నోత్తరాలు ముగించాలని.. రోజూ జీరో అవర్ నిర్వహించాలని బీఏసీ భేటీలో నిర్ణయించారు. డిమాండ్ ఫర్ గ్రాంట్స్‌పై 8 రోజుల పాటు చర్చ జరగనుంది. ఆరు ఆర్డినెన్స్‌లకు సభ ఆమోదం తెలపనుంది. సమావేశాల సందర్భంగా పలు కీలక చర్చలు, బిల్లుల ఆమోదం జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రభుత్వ విధానాలు, ఆర్థిక ప్రణాళికలపై ప్రతిపక్షం నుంచి తీవ్ర చర్చలు జరిగే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. బడ్జెట్ సమావేశాల మధ్యలో ఎమ్మెల్యేల కోసం ప్రత్యేక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యేలకు ఆటల పోటీలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా సభ్యుల మధ్య స్నేహపూర్వక వాతావరణం పెంపొందించడమే లక్ష్యంగా ఉన్నట్లు సమాచారం. ఈసారి అసెంబ్లీ సమావేశాలు రాజకీయంగా, పరిపాలనా పరంగా కీలకంగా మారనున్నాయి.

# ఇంటి రుణ గరిష్ఠ కాల పరిమితి 20 ఏళ్లే




హైదరాబాద్: అర్బన్ సహకార బ్యాంకులు (యూసీబీలు) రుణాల పంపిణీలో తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌బీఐ తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన అనుమతితో ఏర్పాటైన సహకార బ్యాంకు అనే కారణంతో సభ్యులకు పూచీకత్తు లేకుండా ఇష్టమొచ్చినంత రుణాలు ఇవ్వడానికి వీల్లేదని స్పష్టం చేసింది. అలాగే రుణాల పంపిణీకి కొత్త నిబంధనల ముసాయిదాను విడుదల చేసింది. అన్ని రాష్ట్రాలకు, యూసీబీలకు పంపింది. వీటిపై అభిప్రాయాలు తీసుకున్న తరవాత త్వరలో తుది ఉత్తర్వులు జారీ చేస్తామని వివరించింది. ముసాయిదాలో ముఖ్యాంశాలు...ఇల్లు, ఫ్లాట్ కొనడానికి రుణం తీసుకున్న వినియోగదారుకు ఈఎంఐ చెల్లింపు ప్రారంభించడానికి ఇచ్చే గడువు గరిష్ఠంగా 18 నెలలకు మించకూడదు. ఇంటి నిర్మాణం పూర్తవడం లేదా ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) తేదీ వరకు ఈ గడువు ఇవ్వాలి. ఈ రెండు అంశాల్లో ఏది ఎక్కువ కాలపరిమితి ఉంటే దానిని అనుమతించాలి. ఈ రుణాన్ని పూర్తిగా తిరిగి చెల్లించడానికి ఇచ్చే గరిష్ఠ కాలపరిమితి 20 ఏళ్లకు మించరాదు.

# జోగిపేటలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

## రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి దామోదర్ రాజనర్సింహ






**అందోలు, ఫిబ్రవరి 11, మనసాక్షి:**

రాష్ట్రంలో మెజార్టీ ఓటర్లు కాంగ్రెస్ వైపే ఉన్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. బుధవారం జోగిపేట మార్కెట్ కమిటీలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సంరద్బంగా మంత్రి స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పట్ల ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారన్నారు. సీఎం రేవెంత్‌రెడ్డి పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు జరుగుతున్నాయనడానికి ఈ ఫలితాలు ప్రత్యక్ష సాక్షంగా నిలువనున్నాయన్నారు. జోగిపేట మున్సిపల్ స్థానాన్ని కూడా కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్నారు.

**జోగిపేటలో 79.40 శాతం పోలింగ్**

అందోలు--జోగిపేట మున్సిపాలిటీలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. మున్సిపాలిటీలో 20 వార్డులకు 32 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేసారు. 16,450 ఓటర్లకుగాను 13, 061 ఓట్లు పోలవ్వగా 79.40 శాతం నమోదైనట్లు కమిషనర్ వెల్లడించారు. ఈ ఎన్నికల్లో 63 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. జోగిపేట సీఐ అనీల్‌కుమార్, ఎస్ఐ పాండులు ఎన్నికల పోలింగ్‌ను పర్యవేక్షించారు. 12వ వార్డు పోలింగ్ కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ పాండు పరిశీలించారు.

## అక్రమ మద్యం పట్టివేత



**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 11 మనసాక్షి :-**

జిల్లా కేంద్రంలోని సుభాష్ రోడ్ లో అనాధికారికంగా నడపబడుతున్న మద్యం దుకాణంలో బుధవారం ఎక్సైజ్ సీఐ చెన్నయ్య ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేసి అక్రమ మద్యం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ అనంతయ్య తెలిపారు. ఇట్టి దాడులలో 22 లీటర్ల బీరు, 5.5 లీటర్ల మద్యం, మొత్తం (27.5) లీటర్లు మద్యం పట్టుకున్నట్లు ఆయన తెలిపారు.మొత్తం 63 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం మద్యం విలువ 11, 500 ఉంటుందని ఆయన తెలిపారు. నిందితులపై రెండుకేసు లు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై గురువయ్య, కానిస్టేబుల్ లు పాల్గొన్నారు.

## సీఎం కుటుంబ సభ్యులను దూషించిన వ్యక్తి అరెస్ట్

**వెల్దండ ఫిబ్రవరి 11 మన సాక్షి:**



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, అతని కుటుంబ సభ్యులను సామాజిక మాధ్యమాలో దూషిస్తూ పోస్ట్ పెట్టిన ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు. వెల్దండ మండలంలోని గిరిజన తండాకు చెందిన యువకుడు పలు గ్రామాలకు చెందిన ఓ సామాజిక గ్రూపులో సీఎం, అతని కుటుంబ సభ్యులను దూషిస్తూ పోస్ట్ చేశారని ఒక కాంగ్రెస్ నాయకుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అతడిని అరెస్టు చేసి గురువారం రిమాండ్ కు తరలించగా 14 రోజులు జైలు శిక్ష పడినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా అనవసరంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## జీవన్గి జాతర పోస్టర్ ఆవిష్కరణ



**బషీరాబాద్ , జనవరి 11, మన సాక్షి**

బషీరాబాద్ మండలం జీవన్గి గ్రామంలో కాగ్నా నదిలో వెలసిన శ్రీ మహాదేవలింగేశ్వర్ స్వామి జాతర పోస్టర్ ను బషీరాబాద్ తహసీల్దార్ సాహిద బేగం, ఎంపిడిఓ సంపత్ కుమార్,పోలీసులు ఆవిష్కరించారు. అనంతరం సర్పంచ్ రామని బసప్ప మాట్లాడుతూ..ఫిబ్రవరి 14 నుంచి 18 వరకు జరగనున్న జాతర ఉత్సలకు ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జనప్ప, వార్డు సభ్యుడు ఈరప్ప, భీమప్ప, అంజిలప్ప,దశరథ్, పరుశురాం, కమలాకర్, మధు, తదితరులు ఉన్నారు.

## ట్రాక్టర్- ఆటో డీ ఇద్దరు శివ స్వాములు మృతి

**వెల్దండ ఫిబ్రవరి 11 మన సాక్షి:**




నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కొట్ర గ్రామ శివారులో కల్వకుర్తి- హైదరాబాద్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు శివ స్వాముల మృతి చెందారు. కొట్ర గ్రామ శివారులో ఉన్న కేసిఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో హైదరాబాద్ నుండి శ్రీశైలం వెళుతున్న ఆటో.. కల్వకుర్తి నుంచి కొట్ర వైపు వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొన్నాయి. ఆటోలో ప్రయాణిస్తున్న వనపర్తి జిల్లా పాండవుల మండలం తెల్ల రాళ్లపల్లి తండాకు చెందిన కేతావత్ సురేష్ (30), వికారాబాద్ జిల్లా బొమ్రాస్ పేట మండలం ఎరుపు మల్ల గ్రామానికి చెందిన కడమంచి సత్యనారాయణలు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. అనంతరం మృతదేహాలను కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మీరు హైదరాబాద్ లోని బీరంగూడలో ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. శివమాల ధారణ వేసి శ్రీశైలానికి బయలుదేరుతున్న సమయంలో మృతి చెందడంతో ఇద్దరి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ మేరకు ఎస్సై కురుమూర్తి ఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు.

## ఘనంగా శివ స్వాముల మహా పడిపూజ

**వెల్దండ ఫిబ్రవరి 11 మన సాక్షి:**



వెల్దండ మండల పరిధిలోని బొల్లంపల్లి గ్రామంలో శివ స్వాముల మహా పడిపూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గురు స్వాములు కుమారస్వామి, జగన్ ఆచారి, ఆంజనేయులు ఆధ్వర్యంలో బుధవారం ఆంజనేయ స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో సర్పంచ్ సత్తూరి ప్రసాద్ గౌడ్, ఉప సర్పంచ్ రామకృష్ణలు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిట్ల పూజలు నిర్వహించి భజనలు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన శివ స్వాములు పడిపూజ లో పాల్గొని శివనామస్మరణ అని జపించారు. పడిపూజ సందర్భంగా భక్తి గీతాలు, భజనలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివ స్వాములు మహేష్, బన్నీ, తిరుపతయ్య, అంజయ్య, మల్లేష్, నరసింహ్మా, బాలాజీ, బాబురావు, బాబుజి స్వామి, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను విజయ వంతం చేయాలి

**ఆమనగల్లు ఫిబ్రవరి 11 మన సాక్షి:**



లేబర్ కోడ్స్ విబి రామ్ జి చట్టం జాతీయ విత్తన విద్యుత్ సవరణ బిల్లులను రద్దు చేయాలని 1996 కేంద్ర చట్టం రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ జహంగీర్ డిమాండ్ చేశారు.ఈ మేరకు బుధవారం పట్టణ కేంద్రంలోని బాపూజీ తాపీ మేస్త్రీల సంఘం సమావేశం నిర్వహించారు.ఈ సమ్మె కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కన్ స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షులు సుంకర రామ్మోహన్ రావు హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ను రద్దు చేయాలి విబిజి రామ్ జి బిల్లును రద్దు చేసి, నరేగా పథకాన్ని యదావిధంగా కొనసాగించాలి విత్తన విద్యుత్ చట్టాల సవరణను ఉప సంహరించుకోవాలి ఇన్సూరెన్స్ రంగంలో 100% విదేశీ పెట్టుబడులను ఉప సంహరించుకోవాలి భవన నిర్మాణ కేంద్ర చట్టం-1996, అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం-1979 లను కాంట్రాక్ట్ కార్మికుల చట్టం-1970 లను పకడ్బందీగా అమలు చేయాలి, కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి,కార్మిక సంఘాల ప్రతినిధులతో వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించాలి బోర్డు నిధులు దుబారా కాకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలి,ప్రమాద మరణానికి రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు, దహన సంస్కారాల ఖర్చు, ప్రసూతి, వివాహ కానుకలను రూ.లక్షకు పెంచాలి. కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి, కేంద్ర చట్టంలోని స్కాలర్షిప్లు, గృహవసతి, అడ్డాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలి 2009లో నమోదు చేసుకున్న కార్మికుల కార్డులు వెంటనే రెన్యువల్ చేయాలి ఈశ్రమ్ గుర్తింపు కార్డులను భవన నిర్మాణ కార్మికులందరికీ అందజేయాలి కార్మికులకు అవసరం లేని సిఎస్సి హెల్త్ టెస్టులను రద్దు చేయాలి, 96 కేంద్ర చట్టం నిబంధనలకు విరుద్ధంగా ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన రూ.346 కోట్ల నిధులను తిరిగి వెల్ఫేర్ బోర్డులో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల గౌరవ అధ్యక్షులు గంగిశెట్టి సురేందర్, ముఖ్య సలహాదారి ముక్కరి కృష్ణయ్య,ఉన్నారు.

## శ్రీ అంబా రామలింగేశ్వర స్వామి వారికి పట్టు వస్త్రాలు

**వెల్దండ ఫిబ్రవరి 11 (మన సాక్షి):**



దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన గుండాల శ్రీ అంబా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం జేపల్లి గ్రామ వాస్తవ్యులు గునుగంటి మధుసూదన్ రావు అమ్మవారికి 14 పట్టు చీరలు సమర్పించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా స్వామివారి సన్నిధిలో జరుగు వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటున్నాని సంతోషం వ్యక్తం చేశారు. మధుసూదన్ రావుకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి సేవలో విశేషంగా పాల్గొంటూ.. ప్రతి శుక్రవారం, దేవీ నవరాత్రులు, శ్రావణమాసం, కార్తీక మాసం, విశేష పర్వదినములకు, మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు పట్టుచీరలు, పూలమాలలు సమర్పిస్తూ విశేష పూజలు నిర్వహిస్తున్నారని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ రెడ్డి, ఆలయ అర్చకులు శివకుమార్ శర్మ,సురేష్ శర్మ, నరహరి శర్మ తదితరులు పాల్గొన్నారు.

## టీడబ్ల్యూజేఫ్ ఫెడరేషన్ దేశవ్యాప్త సమ్మెకు మద్దతు

### పాత్రికేయులంతా విరివిగా పాల్గొనాలి

**ఆమనగల్లు,ఫిబ్రవరి 11మన సాక్షి:**

కేంద్రంలోని బీజేపీ సర్కార్ అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రేపు గురువారం జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ టీడబ్ల్యూజేఫ్ రాష్ట్ర కమిటీ మద్దతు ప్రకటించింది.ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ పి. రాంచందర్ ప్రధానకార్యదర్శి బి.బసవపున్నయ్య మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరించడాన్ని ఖండించారు. మోడీ సర్కారు తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు.రద్దయిన 29 చట్టాల్లో పాత్రికేయు లకు సంబంధించి రెండు చట్టాలు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. జర్నలిస్టుల కనీస వేతనాలకు సంబంధించి గురుబక్ష్ మతీజియా వేజ్ బోర్డు సిఫారసులను అమలు చేయించకపోగా ఉన్న చట్టాన్ని కోడ్ లు గా మార్చి పాత్రికేయ రంగాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు.జాతీయ కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మెలో రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టులు భారీ సంఖ్యలో పాల్గొని సమ్మెను పిలుపునిచ్చారు.12న హైదరాబాద్లోని ఇందిరాపార్క్ వద్ద ఉదయం 11 గంటలకు జరిగే సమ్మెలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ పోలింగ్

### 74.18% పోలింగ్ నమోదు.

**నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 11 మనసాక్షి :-**




మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నారాయణపేట పురపాలక సంఘం 24 వార్డుల పరిధిలో 56 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 24 వార్డుల్లో 96 మంది పోటీలో ఉన్నారు. పట్టణంలో మొత్తం 35,460 ఓటర్లకు గాను 26, 304 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 12,948 మహిళలు 13,356 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు సహాయ ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య తెలిపారు. పేట పట్టణంలో మొత్తంగా 74.18% ఓట్లు పోలైనట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని పురపాలక సంఘాలు కోస్గి పురపాలక సంఘంలో 74.83%, మద్దూరు 79%, మక్తల్ 65.83% పోలింగ్ నమోదు అయింది. జిల్లా మొత్తంలో 72.87% పోలింగ్ నమోదు అయింది. జిల్లాలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మోసాల పైన ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**కొడంగల్ ఫిబ్రవరి 11 మన సాక్షి.**



కొడంగల్ నియోజకవర్గం ఇండాపూర్ గ్రామంలో బ్యాంకింగ్ మోసాల పైన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దౌల్తాబాద్ ఎస్బిఐ బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ వినోద్ కుమార్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ , బ్యాంకులో ఖాత కలిగి ఉన్న వినియోగదారులు తమ కేవైసీ చేసుకోవాలని ఆయన అన్నారు. అదేవిధంగా డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్న నేపథ్యంలో సైబర్ నేరలు బ్యాంకింగ్ మోసాలు అధికమవుతున్నాయి . ఈ క్రమంలో ప్రజలు అవగాహన పెంచేందుకు ఆర్బిఐ ప్రత్యేకంగా రూపొందించిన సైబర్ భద్రత బ్యాంక్ అధికారులు ,పోలీస్ విభాగ సమన్వయంతో నిర్వహిస్తున్న ఈ అవగాహన కార్యక్రమంలో ఫోన్ ఓటిపిలు , ఏటీఎం పిన్, సి వి వి నంబర్ వంటి వివరాలను ఎవరికి చెప్పవద్దు అన్నారు బ్యాంకు పేరుతో వచ్చేఅనుమాన స్పందన ఫోన్ కాల్స్ మెసేజ్ లింకులకు స్పందించోదని ఆయన అన్నారు. ఏదైనా సైబర్ మోసం జరిగితే వెంటనే1930 నెంబర్ కు కాల్ చేయాలని లేదా సైబర్ క్రైమ్ జీవో వి ఇన్ వెబ్ సైట్ లో ఫిర్యాదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్యదర్శి స్వాతి ,సర్పంచ్ వెంకటయ్య , విష్ణు , చందు ,ఎస్బిఐ బృందం , గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సూర్యాపేట మున్సిపాలిటీలో కాంగ్రెస్ విజయం సాదిస్తుంది

**సూర్యాపేట, ఫిబ్రవరి 11, మనసాక్షి :**



సూర్యాపేట మున్సిపాలిటీ కి జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని డిసిసి అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మున్సిపాలిటీ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత 46వ వార్డులో మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ లతో కలిసి వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఐదు మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటుందని అన్నారు. సూర్యాపేట పట్టణంలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పట్టారని, ప్రతి వార్డులో పార్టి విజయపథంలో ముందుకు దూసుకుపోతుందని, 40 స్థానాలను గెలుస్తుందని వారు అన్నారు. మాజీ మంత్రి , పదేళ్ల పాటు పరిపాలన చేసిన గుంటకండ్ల జగదీశ్ రెడ్డి రెడ్డి సూర్యాపేటకు చేసిందేమిలేదని, కాంగ్రెస్ పార్టీ వస్తే సూర్యాపేట అభివృద్ధి చెందుతుందని, ప్రజలు అర్థం చేసుకున్నారని వారు అన్నారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటిస్తుందని, బీసీలకు 48% ఎస్సీలకు 9 సీట్లు, ముస్లింలకు ఆరు సీట్లు ఇచ్చిందని మున్సిపల్ చైర్మన్ పదవి ఆర్యవైశ్య మహిళకు ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ నెల 13 న జరిగే కౌంటింగ్ తర్వాత కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున సంబరాలు జరుగుతుందని తెలిపారు.

# ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

**77.36% పోలింగ్ నమోదు.**

**ఓటు హక్కు ఉపయోగించుకున్న మంత్రి కోమటిరెడ్డి.**

**పోలింగ్ సరలిని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ.**

**కట్టుదిట్టమైన భద్రతా చర్యలు.**









**నల్లగొండ ఫిబ్రవరి 11 మన సాక్షి.**

నల్లగొండ కార్పొరేషన్ కు బుధవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 48 డివిజన్లకు అధికారులు పోలింగ్ నిర్వహించారు. పోలింగ్కు కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సాయంత్రం ఐదు గంటలకు పోలింగ్ ముగిసింది. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం ఏడు గంటలకు మందకుడిగా ప్రారంభమైన పోలింగ్ 11 గంటలకు పుంజుకుంది. ఉదయం 11 గంటలకు 21.47% ఒంటిగంటకు 43.31% మూడు గంటలకు 64.11 5 గంటలకు 77.36 % పోలింగ్ నమోదయింది. కాగా సాయంత్రం 5 తర్వాత క్యూ లైన్ లో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఉదయం 9:30 కు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి 33వ వార్డులోని నల్లగొండ పబ్లిక్ స్కూల్లో ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. అలాగే మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి 34వ వార్డు వీటి కాలనీ గీతాంజలి స్కూల్లో ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి బుర్రి చైతన్య 33 వ వార్డులో ఉపయోగించుకున్నారు. టిఆర్ఎస్ పార్టీ మేయార్ అభ్యర్థి చెకిలం వసంత 48 వార్డు గీతా విజ్ఞాన మందిర్ లో తమ ఓటు హక్కు ఉపయోగించుకున్నారు పట్టణంలో, రెండు ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి వినూతనంగా పోలింగ్ నిర్వహించారు. కాగా పోలింగ్ సరళని శాంతి భద్రతలను ఎప్పటికప్పుడు కలెక్టర్ చంద్రశేఖర్ ఎస్పీ హరిశ్చంద్ర పవార్లు పర్యవేక్షించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద భారీ భద్రత ఏర్పాటు చేసి పోలింగ్ సజావుగా జరిగేలా కృషి చేశారు.

## బషీరబాద్ నుండి శ్రీశైలంకి శివ స్వాములు



**బషీరాబాద్, ఫిబ్రవరి 11 మన సాక్షి:**

బషీరాబాద్ మండలం వివిధ గ్రామాల నుండి శివ స్వాములు గురు స్వామి వెంకట్ స్వామి, నరేష్ స్వామి, నరేష్ , సాయినాథ్ గౌడ్, రఘు, శేఖర్,వంశీ, రానోజీ అయ్యప్ప స్వామి మందిరం నుండి శ్రీశైలం దర్శనం కోసం వెళ్లడమ్ము జరిగింది ఇందులో గ్రామ ప్రజలు,భక్తులు పాల్గొనడం జరిగింది..

## మిర్యాలగూడలో చికెన్ చిట్టీలు



**మిర్యాలగూడ, ఫిబ్రవరి 11, మన సాక్షి :**

మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు రాజకీయ పార్టీలు చికెన్ చిట్టి లను పంచారు. పలు వార్డులలో చికెన్ చిట్టీలను ఇంటింటికి పంచడంతో వారంతా చికెన్ సెంటర్ వద్దకు గుంపులుగా చేరుకున్నారు. దాంతో చికెన్ సెంటర్ యజమాని తలుపులు మూసి కిటికీలోనుంచి చికెన్ చిట్టీలకు చికెన్ అందజేశారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్



**మిర్యాలగూడ , ఫిబ్రవరి 11, మన సాక్షి,**

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ లో భాగంగా బుధవారం స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు 15వ వార్డులో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్

**సూర్యాపేట ఫిబ్రవరి 11 మనసాక్షి**



మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బుధవారం స్థానిక కృష్ణానగర్ కాలనీ లో ఏర్పాటు చేసిన వార్డు నంబర్ 14, పోలింగ్ స్టేషన్ నంబర్ 49 వద్ద ఓటు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి చేరుకుని నిర్భయంగా ఓటు వేయాలని, స్థానిక స్వపరిపాలనలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నందికొండలో 59.7 శాతం పోలింగ్

**నాగార్జునసాగర్. ఫిబ్రవరి, 11,మన సాక్షి**



నాగార్జునసాగర్,మునిసిపల్ ఎన్నికల్లో భాగంగా బుధవారం నందికొండ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన ఎన్నికలలో 59.7 శాతం పోలింగ్ నమోదు అయినట్లుగా జిల్లా ఎన్నికల సహాయ అధికారి, నందికొండ మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డి తెలిపారు. నందికొండ మున్సిపాలిటీ పరిధిలో 12 వార్డులు ఉండగా మొత్తం 24 పోలింగ్ బూ తులను ఏర్పాటు చేశారు. ఉదయం ఏడు గంటలకే పోలింగ్ ప్రారంభం కాగా ఉదయం 9 గంటల వరకు కూడా పోలింగ్ మందకొడిగా సాగింది. ఉదయం 9 గంటలకు 9. 14% పోలింగ్ నమోదు కాగా 11 గంటలకు 25. 15%, మధ్యాహ్నం ఒంటిగంటకు 43. 65, 3 గంటలకు 52. 98 శాతం పోలింగ్ నమోదయింది. పోలింగ్ ముగిసే సమయానికి 59.7 శాతం నమోదు అయ్యింది. నందికొండ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 13, 531 మంది ఓటర్లు ఉండగా 8,069 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 3, 854 మంది పురుషులు, 4,214 మంది స్త్రీలు, ఇతరుల విభాగంలో ఒకరు ఉన్నారు. నందికొండ మున్సిపాలిటీ పరిధిలో ఐదో వార్డులో మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి, ఆయన సతీమణి సుమతి, ఎంపీ రఘువీర్ రెడ్డి, సాగర్ శాసనసభ్యులు జై వీర్ రెడ్డి మున్సిపల్ ఎన్నికలలో తమ ఓటును వినియోగించుకున్నారు. నందికొండ మున్సిపాలిటీ ఎన్నికలలో ప్రధానంగా కాంగ్రెస్ బి. ఆర్. ఎస్ బిజెపి పార్టీలు పోటీలలో ఉండగా కాంగ్రెస్ బిఆర్ఎస్ అభ్యర్థుల మధ్యనే ప్రధాన పోటీ కొనసాగింది. కాంగ్రెస్ బిఆర్ఎస్ అభ్యర్థులు ఎవరికి వారే తామే మెజారిటీతో గెలుస్తామని అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనా నందికొండ మునిసిపాలిటీ ఓటర్ల తీర్పు ఈ నెల 13న బహిర్గతం కానున్నది. కాగా బుధవారం నాడు నందికొండ మున్సిపాలిటీల్లో నిర్వహించిన పోలింగ్లో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.

## ప్రశాంతంగా పోలింగ్

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ఫిబ్రవరి 11 మనసాక్షి**



సూర్యాపేట, హుజూర్నగర్, కోదాడ, తిరుమలగిరి, నేరేడుచర్ల మున్సిపాలిటీలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగు తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. బుధవారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో జడ్పి ఉన్నత పాఠశాల, ఆనంద్ విద్యా మందిర్ హై స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తేజ్ హై స్కూల్, చుక్కారామయ్య హై స్కూల్, కుడకుడలోని ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి సందర్శించి ఏర్పాట్లు, ఓటింగ్ విధానాన్ని పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సందర్శించి వెబ్‌కాస్టింగ్ ప్రక్రియను పరిశీలించారు.

పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ఎలాంటి అంతరాయాలు లేకుండా కొనసాగుతున్నదని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, తహసీల్దార్ కృష్ణయ్య, ఎన్నికల సిబ్బంది ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాలెట్ బాక్స్ లో అభ్యర్థుల భవిష్యత్తు

### ప్రశాంతంగా మున్సిపాలిటీ ఎన్నికలు.

**తుంగతుర్తి మన సాక్షి, ఫిబ్రవరి 11.**





తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలో మున్సిపాలిటీ ఎన్నికలలో ప్రజలు 15 వార్డులలో కౌన్సిలర్లు వాళ్ళు పార్టీలలో నిలబడటం ప్రచారం చేయడం జరిగింది . ఈరోజు ఉదయం ఏడు గంటలకు ఓటింగ్ ప్రారంభం కాగా మొదట కొద్దిగా మందకోడిగా ఓటింగ్ జరిగినప్పటికీ మధ్యాహ్నం వరకు ఓటింగ్ శాతం పెరిగింది మున్సిపల్ ఏడో వార్డులో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ కమల ఓటు వేసి ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధంగా తిరుమలగిరి 14వ వార్డులో ఒక్క ఓటు కోసం విమానంలో హైదరాబాదుకు వచ్చి ఉత్తరప్రదేశ్ నుంచి ఓ వ్యక్తి వచ్చి ఓటు వేయడం తో అతనిని వారి వార్డు సభ్యులు ఉలిక్కిపడ్డారు. దీనితోపాటు వేల్పుల సోమక్క కాలు విరుగగా కుటుంబ సభ్యులు సిబ్బంది వీల్ చైర్ లో తీసుకొని వెళ్లి పోలింగ్ కేంద్రంలో ఓటు వేయించారు అదేవిధంగా మధ్యాహ్నం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మున్సిపాలిటీలో మొత్తం పోలైన కోట్ల 15,450 ఓట్లు గాను 13,856 ఓట్లు పోలేనట్లు దీనితో 85.36% ఓటర్లు పోలింగ్ శాతం నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ నోడల్ అధికారి తహసిల్దార్ హరిప్రసాద్ తెలిపారు జిల్లా కలెక్టర్ తేజస్విని మండలాల పవర్ అధికారులను అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులను డిఎస్పి పర్యవేక్షణలో జరుగుతుందని తెలిపారు. అన్ని మున్సిపాలిటీలను ఎస్పీ నరసింహ ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఎస్పీలతో డిఎస్పీలతో సూర్యాపేట జిల్లాలోని మున్సిపాలిటీ కేంద్రాలను కట్టుదిట్టమైన భద్రతతో ఎలక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు.

## కార్మికులందరూ సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలి



**గరిడేపల్లి ఫిబ్రవరి 11 మనసాక్షి**

తాళ్ల మల్కాపురం గ్రామంలో కార్మికులను ఉద్దేశించి భవన నిర్మాణ సంఘం (సీఐటీయూ అనుబంధం) గరిడేపల్లి మండల అధ్యక్షుడు జంజనం కోటేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ బిల్డింగ్ ఢ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొనాలని వారు కోరారు. కార్మికుల హక్కులను కాలరాయటమే కాక రాష్ట్ర హక్కులను హరిస్తూ చట్టాలను చేసింది. అత్యంత ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్లను. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలతో పాటు, భవన నిర్మాణ కార్మికుల 1996 కేంద్ర చట్టం, 1979 అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టాలను రద్దు చేసింది. వి. బి. జి. రామ్ చట్టం. జాతీయ విత్తన బిల్లు విద్యుత్ సవరణ బిల్లు. 1996 చట్ట రక్షణకై. వీటికి వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు, వ్యవసాయ సంఘాలు. 2026 ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె చేయాలని పిలుపునిచ్చాయి. సమ్మెలో భవన మరియు ఇతర నిర్మాణ కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాతికింది గురుస్వామి. శాంతి. నీలిమ. ఈరమ్మ. సైదా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ దిష్టిబొమ్మ దగ్ధం

**గరిడేపల్లి ఫిబ్రవరి 11 మన సాక్షి**




గరిడేపల్లి వెలిదండ గ్రామంలో అఖిల భారత రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో మోడీ దిష్టిబొమ్మ దగ్ధం చేయడం జరిగింది.

ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షుడు పోటు లక్ష్మయ్య పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో మోడీ తీసుకువచ్చిన నూతన విత్తన చట్టం, విద్యుత్ సవరణ బిల్లు, నాలుగు లేబర్ కోడ్ లు, స్వేచ్ఛావాణిజ్యం పేరుతో ట్రంప్ తో అమెరికా ఉత్పత్తుల దిగుమతికి సుంకాలు ఎత్తివేయడం దుర్మార్గమని అన్నారు. మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చి జిరాంజీ పేరును తీసుకువచ్చి గతంలో ఉన్నటువంటి విధానాన్ని పక్కన పెట్టి రాష్ట్రాలపై భారం మోపుతూ కేంద్రం పక్కకు తప్పుకునేటటువంటి విధానాన్ని అవలంబిస్తుందని, అందులో భాగంగానే రాష్ట్రాలపై 40% శాతం కేంద్రం 60% శాతం బరించే విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న అనేక చట్టాలను పక్కనపెట్టి నాలుగు కోడ్ లు గా తీసుకువచ్చి కార్పొరేట్లకు సంపన్న వ్యాపార వర్గాలకు అనుకూలంగా మలిచారని వీటికి వ్యతిరేకంగా నేడు జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సభలో రైతులు, కూలీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలి సంఘం డివిజన్ అధ్యక్షులు పారేల్లి నాగయ్య,ఇప్ప జిల్లా నాయకుడు కామల్ల శ్రీను, గండు నాగేష్, చనగాని పెద్ద సాంబయ్య, చనగాని పర్వతాలు, గండు మల్లయ్య, లచ్చయ్య, ముత్తయ్య, మల్లేష్, చనగాని లక్ష్మయ్య, వీరబాబు తదితరులు

# ప్రశాంతంగా పోలింగ్: కలెక్టర్ బి చంద్రశేఖర్





**నల్లగొండ, ఫిబ్రవరి 11,మన సాక్షి.**

మున్సిపల్ ఎన్నికలలో భాగంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ తోపాటు, జిల్లాలోని 6 మున్సిపల్టీలలో ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రారంభమైన వెంటనే ఆయన నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్ సమీపంలో ఉన్న ఉర్దూ మీడియం పాఠశాల లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ ఓటర్లకు చేసిన ఏర్పాట్లు, పోలింగ్ సరళిని పరిశీలించారు. అన్ని గదుల నుండి వెబ్ క్యాస్టింగ్ ఉండేలా చూడాలని, అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రథమ అందించేందుకు మెడికల్ టీంలు గేట్ సమీపంలో ఏర్పాటు చేయాలని, దివ్యాంగ ఓటర్లు ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రం సమీపంలో వీల్ చైర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, పోలింగ్ కేంద్రంలోకి సెల్ ఫోన్ అనుమతించకూడదని, ఓటర్లు ఎన్నికల సంఘం అనుమతించిన 18 గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి చూపించిన వెంటనే లోపలికి అనుమతించాలని కలెక్టర్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.అనంతరం బోయవాడ పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటర్లతో మాట్లాడారు. సౌకర్యాలు, ఇబ్బందులపై ఆరా తీశారు.అనంతరం



మీడియా ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 7గంటల నుండి జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలలో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలైన్లలో నిలుచున్నారని, పోలింగ్ ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఓటింగ్ శాతం పెరిగేందుకు అవగాహన కల్పించడం వల్ల ఈ విడత ఓటింగ్ పర్సంటేజ్ పెరిగేందుకు అవకాశం ఉందన్నారు .ఓటర్లకు ఎక్కడ ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నామని ,మహిళ ,పురుష ఓటర్లకు వేరువేరుగా క్యూలైన్ల ఏర్పాటు , తాగునీరు, టెంట్,కుర్చీలు, దివ్యాంగ ఓటర్లకు వీల్ చైర్లు, హెల్ప్ డెస్కు ఏర్పాటు చేశామని , ప్రత్యేకించి వార్డ్ ఆఫీసర్లను కూడా నియమించామని, ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారని, ఏవైనా సమస్యలు వస్తే పరిష్కరించేందుకు జిల్లా స్థాయిలో ఏర్పాటు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని సమస్యలపై కంట్రోల్ రూమ్ లోని ఫోన్ నెంబర్ 18004251442 కు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన కోరారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో 100% వెబ్ క్యాస్టింగ్ చేస్తున్నామని, పోలింగ్ సిబ్బంది సంక్షేమం కోసం అన్ని చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లా వ్యాప్తంగా నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్, మిర్యాలగూడ , దేవరకొండ, నందికొండ ,హాలియా, చిట్యాల, చండూరు మున్సిపాలిటీలకు సంబంధించి వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించారు.మున్సిపల్ ఎన్నికల జిల్లా సాదిరణ పరిశీలకులు జి. రమేష్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శరత్ చంద్ర, స్థానిక తహసిల్దార్ పరశురాం, తదితరులు ఉన్నారు. కాగా ఉదయం 9 గంటలకు జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు కలుపుకొని 11.2 శాతం ఓట్లు పోలయ్యాయి.

# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల తనిఖీ

## జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్లగొండ,ఫిబ్రవరి 11, మన సాక్షి.**





మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పట్టణ కేంద్రంలోని ఓల్డ్ సిటీ 27వ వార్డు మిర్యాలగూడ రోడ్డు 22 వార్డ్,గొల్లగూడ 20 వార్డులో గల పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రత్యక్షంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడిన జిల్లా ఎస్పీ , ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు భద్రతాపరంగా పలు కీలక సూచనలు చేశారు. పోలింగ్ రోజున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని, శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ, పోలింగ్ సమయంలో పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, గుంపులపై నిరంతరం నిఘా ఉంచాలని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లను సక్రమంగా నిర్వహిస్తూ, ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. అదేవిధంగా పోలింగ్ కేంద్రం లోపల మరియు బయట తగిన బందోబస్తు ఏర్పాటు చేయడం, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ నిర్వహించడం, వాహనాల రాకపోకలను నియంత్రించడం, అనవసర వ్యక్తుల ప్రవేశాన్ని కట్టడి చేయడం వంటి అంశాలపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి,ఎస్బి సీఐ రాము, టు టౌన్ సీఐ రాఘవ రావు,నల్లగొండ 1 టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్.ఐలు తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను పూర్తి చేయండి

## ఎంపిడిఓ లతీఫ్ ఖాన్

**రామసముద్రం,పిబ్రవరి11 మన సాక్షి**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎన్టీఆర్ గృహ నిర్మాణాలపై హౌసింగ్ సిబ్బందితో ఎంపిడివో లతీఫ్ ఖాన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో కొత్తగా మంజూరైన ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఆయా సచివాలయ పరిధిలో మంజూరైనా గృహాలకు సంబంధించి హౌసింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాలకు వెళ్లి లబ్ధిదారుల గృహాలను పరిశీలించి, అవగాహన కల్పించి త్వరగా గృహ నిర్మాణాలు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ గృహ నిర్మాణాలను అందరికీ ఇల్లు అనే ఉద్దేశంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారని అన్నారు. కావున ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను ఉగాదికి పూర్తి చేసి గృహప్రవేశం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈసమావేశంలో ఎంపిడివో లతీఫ్ ఖాన్, హౌసింగ్ అధికారిని రాజేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో యూత్ లీడర్లు వీరే

**మదనపల్లి, ఫిబ్రవరి 11, మన సాక్షి**



తంబళ్లపల్లి నియోజకవర్గంలో వైయస్సార్సీపిని బలోపేతం చేసేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నట్లు వైసీపీ యూత్ విభాగం అధ్యక్షులు కోళ్ల వాసుదేవ రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు ఎంపికైన యూత్ అధ్యక్షులను ఆయన ప్రకటించారు. పెద్దమండ్యం మండల యూత్ అధ్యక్షులుగా సాదిక్, మొలకలచెరువు అధ్యక్షులుగా మహిపాల్ రెడ్డి, తంబళ్లపల్లి అధ్యక్షులుగా అశోక్ రెడ్డి, పిటియం అధ్యక్షులుగా డి. శివ శంకర్ రెడ్డి, కురబలకోట అధ్యక్షులుగా బి. సుధీర్ రెడ్డి, బి. కొత్తకోట పట్టణ అధ్యక్షులుగా సి. గౌతంరెడ్డి, బి. కొత్తకోట మండల అధ్యక్షులుగా యం. నరేష్ ఏకగ్రీవంగా ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోళ్ల వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ తంబళ్లపల్లి నియోజకవర్గంలో గ్రామస్థాయి నుండి వైసీపీని బలోపేతం చేసే లక్ష్యంతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, తంబళ్లపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వైయస్ఆర్సీపీని మరింత బలోపేతం చేస్తూ, పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతామని వాసుదేవరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి సూచనల మేరకు ప్రతి మండలంలో యువజన విభాగం అధ్యక్షులను నియమించినట్లు చెప్పారు.

# పారిశుధ్య సిబ్బందితో డీసీ సమీక్ష

**శేరిలింగంపల్లి 11 ఫిబ్రవరి మన సాక్షి**




మియాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శశిరేఖ అధ్యక్షతన బుధవారం పారిశుధ్య విభాగంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలోని ప్రధాన రహదారులు, కాలనీలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను డీసీ ఆదేశించారు. కాలనీలలో పారిశుధ్య పనులను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, చెత్తను బయట వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఇంటి చెత్తను రోజువారీగా చెత్త ఆటోలకు అందించే విధంగా చర్యలు చేపట్టాలని డీసీ శశిరేఖ తెలిపారు.సర్కిల్ పరిధిలోని అన్నపూర్ణ క్యాంటిన్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. చెత్త సేకరణ ఆటోలు ఇండ్ల నుండి మరియు వాణిజ్య సముదాయాల నుండి చెత్తను సమయానికి సేకరిస్తున్నాయా లేదా అన్నది ప్రతిరోజు తనిఖీలు చేయాలనీ స్పష్టం చేశారు.ప్రతి షాప్, అపార్ట్మెంట్, స్ట్రీట్ వెండర్స్, కార్యాలయాలు, ప్రార్థనా మందిరాలు మొదలైన వారు తప్పనిసరిగా రెండు డస్ట్బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, తడి--ఎండు చెత్తను వేరు చేసి చెత్త ఆటోలకు అందించేలా చూడాలని సూచించారు. రోడ్లపై చెత్త వేస్తున్న వారిని గుర్తించి జిహెచ్ఎంసీ యాప్ ద్వారా పెనాల్టీ చలాన్లు జారీ చేసి కట్టడి చేయాలని ఆదేశించారు.సమావేశంలో సర్కిల్ పారిశుధ్య అధికారి వశీధర్ డీఈ నిఖిల్,ఏఈ శ్రీనివాస్,ఎస్ ఎస్, ఎస్ ఆర్ పిలు,ఎస్ ఎఫ్ ఏలు, రాంకీ సిబ్బంది పాల్గొన్నారు.

# పేకాటరాయుల్లపై మెరుపు దాడి



**రామసముద్రం ఫిబ్రవరి 11 మన సాక్షి**

అన్నమయ్య జిల్లా మండలంలోని కనగాని గ్రామ సమీపంలో ఓ చెరువు వద్ద పేకాట ఆడుతున్న సమాచారం మేరకు ఎస్సై ఉమామహేశ్వర రెడ్డి సిబ్బందితో కలిసి రైడ్ చేయగా పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు .వీరి నుండి 9300 రూపాయలు, నాలుగు మోటర్ సైకిల్లు, నాలుగు సెల్ ఫోన్స్ ను స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు.

# గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతం



**మదనపల్లి, ఫిబ్రవరి 11, మన సాక్షి :**

మదనపల్లి రూరల్ మండలంలోని బసినికొండ, రామాచార్లపల్లి, పోతబోలు గ్రామ పంచాయతీల్లో వైకాపా రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. పరిశీలకులు మనుజారెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, వి.యస్. రెడ్డిల ఆధ్వర్యంలో జరిగాయి. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం లక్ష్యంగా సమావేశాలు నిర్వహించినట్లు వారు తెలిపారు. బసినికొండ గ్రామపంచాయతీ అధ్యక్షుడిగా పఠాన్ బావ జాన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, భాస్కర్ రెడ్డి, ముబీన (ఎంపీటీసీ), మహబూబ్ బాషా, అనిల్ కుమార్, సుధాకర్, రమణ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. రామాచార్లపల్లి గ్రామపంచాయతీ అధ్యక్షుడిగా కత్తి రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ లక్ష్మీదేవి, గంగాధర్, రహంతుల్లా, కత్తి మంజు, మురళి, ఆంజప్ప, శివ, షఫీ, చైతన్య తదితరులు పాల్గొన్నారు. పోతబోలు గ్రామపంచాయతీ అధ్యక్షుడిగా శివయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరయ్య, నాగరాజా, రత్నయ్య, వెంకటేశు, వెంకటరమణ, మురాది, కరీముల్లా, బాబు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశీలకులు మాట్లాడుతూ గ్రామ కమిటీ అధ్యక్షులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో రచ్చబండ కార్యక్రమాల ద్వారా గ్రామ అధ్యక్షుల ఎన్నికలు కొనసాగుతాయని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా రాష్ట్ర రాజకీయ పరిణామాలపై కూడా నేతలు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీ మరింత బలోపేతం అవుతూ "జగన్ 2.0" లక్ష్యాలతో ముందుకు సాగుతుందని, ప్రజా సంక్షేమమే ప్రధాన అజెండాగా పనిచేస్తామని నాయకులు పేర్కొన్నారు.

# ఫిరాయింపుదారులకు ప్రజా కోర్టులో శిక్ష తప్పదు

**శేరిలింగంపల్లి 11ఫిబ్రవరి మన సాక్షి**



స్వలాభం కోసం నైతిక విలువలను తాకట్టు పెట్టి పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డ కార్పొరేటర్లకు రాబోయే ఎన్నికల్లో ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టడం ఖాయమని శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. కార్పొరేటర్ల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో, పార్టీని వంచిన వారి తీరును నిరసిస్తూ చందానగర్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వినూత్న రీతిలో నిరసన తెలిపారు.

### రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కారు

సందర్భంగా బీఆర్ఎస్ ముఖ్య నాయకులు మాట్లాడుతూబాసాహెబ్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగ స్ఫూర్తిని, 10వ షెడ్యూల్ పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం)ను
ఫిరాయింపుదారులు అపహాస్యం చేశారని ధ్వజమెత్తారు.బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి, కారు గుర్తుపై షికారు చేసి అధికారం మారగానే నైతికత వదిలేసి కాంగ్రెస్ 'చేతిలో చేయి' కలపడం ప్రజలను వంచించడమేఅని దుయ్యబట్టారు.

### పదవుల కోసం డివిజన్ల తాకట్టు

కేవలం స్వప్రయోజనాల కోసం డివిజన్లను తాకట్టు పెట్టిన ఇటువంటి నాయకులకు ప్రజాస్వామ్యంలో కొనసాగే అర్హత లేదని నేతలు పేర్కొన్నారు.
వెన్నుపోటు రాజకీయాలు గెలిపించిన పార్టీకి ఓటేసిన ప్రజలకు వెన్నుపోటు పొడిచిన వీరి పాపాలకు నిష్కృతి లేదన్నారు. ప్రజా కోర్టులో శిక్ష రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉండి రాజ్యాంగ విరుద్ధంగా ప్రవర్తించిన వీరిని రేపు ఏ ముఖం పెట్టుకుని ప్రజల వద్దకు వెళ్తారని ప్రశ్నించారు

### 'మాజీ'లకు గుణపాఠం తప్పదు

నేటితో పదవీ కాలం ముగిసి మాజీ'లుగామారిన ఫిరాయింపుదారులను డివిజన్ల నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అవకాశవాద రాజకీయాలకు పాల్పడే వారికి టికెట్లు ఇస్తే రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. అధికారం శాశ్వతం కాదని, నమ్ముకున్న సిద్ధాంతాన్ని వదిలిన వారు చరిత్రహీనులుగా మిగిలిపోతారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సైబరాబాద్ తొలి కమిషనర్‌గా శ్రీజన బాధ్యతలు

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 11, మన సాక్షి**



మహానగర పరిపాలనను మరింత మెరుగుపరిచేందుకు తెలంగాణ ప్రభుత్వం జీహెచ్ఎంసీ ని విభజిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి అనే మూడు స్వతంత్ర మున్సిపల్ కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది.

### ముఖ్య విశేషాలు:

తొలి కమిషనర్: నూతనంగా ఏర్పడిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తొలి కమిషనర్‌గా 2013 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ శ్రీజన బాధ్యతలు స్వీకరించారు.
ప్రత్యేకాధికారి: మూడు కార్పొరేషన్లకు ప్రత్యేకాధికారిగా నియమించబడిన సీనియర్ ఐఏఎస్ జయేష్ రంజన్ సమక్షంలో ఆమె బాధ్యతలు చేపట్టారు.
విధులు: కమిషనర్ శ్రీజన ఇకపై ఐటీ కారిడార్, వెస్ట్ హైదరాబాద్‌లోని కీలక ప్రాంతాల అభివృద్ధి మరియు పరిపాలనను పర్యవేక్షించనున్నారు. సవాళ్లు: ఐటీ హబ్ అయిన సైబరాబాద్ ప్రాంతంలో ట్రాఫిక్ నియంత్రణ, వ్యర్థాల నిర్వహణ, మౌలిక సదుపాయాల మెరుగుదల ఆమె ముందున్న ప్రధాన లక్ష్యాలు. అనుభవం: గతంలో ఆమె విశాఖపట్నం (జీవీఎంసీ) కమిషనర్‌గా, కర్నూలు మరియు ఎన్టీఆర్ జిల్లాల కలెక్టర్‌గా పనిచేశారు. కోవిడ్ సమయంలో ప్రసవించిన కేవలం 22 రోజులకే విధుల్లోకి చేరి తన కర్తవ్య నిష్ఠను చాటుకున్నారు.

# వక్ఫ్ ఆస్తులను దారాదత్తం చేస్తే ఊరుకోం

**మదనపల్లి, ఫిబ్రవరి 11, మన సాక్షి:**



వక్ఫ్ ఆస్తులను దారాదత్తం చేస్తే చూస్తూ ఊరుకోమని వక్ఫ్ భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ముస్లింపైనా ఉందని వైఎస్సార్సీపీ మైనార్టీ నాయకులు పేర్కొన్నారు.బుధవారం టిప్పు సుల్తాన్ మైదానంలో వక్ఫ్ భూమిలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న షెడ్డు వద్ద విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి వైకాపా స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ షమీం అస్లాం,మునిసిపల్ వైస్ ఛైర్మన్ నూర్ ఆజామ్,మైనార్టీ నాయకులు రఫీక్ అహ్మద్,నూర్ మొహిద్దీన్ ఖాన్,రహీం,షఫీ,షెనవాజ్,రహంతుల్లా,తాజ్ బాషా,అబ్దుల్ సమ్మద్,ఎన్.నవాజ్,ఫయాజ్,సయ్యద్ బాషా, జాఫర్,సయిాఫ్,సుహే ల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా షమీం అస్లాం, రఫీక్ అహ్మద్, నూర్ మొహిద్దీన్ ఖాన్, నూర్ అజాంలు మాట్లాడుతూ తాము మదనపల్లి నియోజకవర్గంలోని వక్ఫ్ భూములని కాపాడాలని జిల్లా కలెక్టరుకి వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు.దీనిని జామియా మసీద్ కమిటీ సభ్యులకు,టిడిపి మైనార్టీ నాయకులు రాద్ధాంతం చేయడం సబబు కాదన్నారు.అదీ కాక పవిత్రమైన మసీదు ప్రాంగణంలో రాజకీయ అంశాలు మాట్లాడడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. గత వైసీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే నవాజ్ బాషా వక్ఫ్ భూముల పరిరక్షణకు ఎంతో కృషి చేశారని,టిప్పు సుల్తాన్ మైదానంలో అనుమతులు లేని షెడ్లను తొలగించి,అనుమతులు ఉన్న షెడ్లను యధావిధిగా కొనసాగించడం జరిగిందన్నారు.మాజీ ఎమ్మెల్యే ముఖ్య సూటిగా వ్యవహరించే వ్యక్తి అని,నిజాయితీకి నిదర్శనమన్నారు.దీనిని వక్రీకరించి పోలీసుల అండతో వైసిపి నాయకులు దౌర్జన్యంగా తొలగించారని ఆరోపించడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు.మజీద్ కమిటీ సభ్యులు రాజకీయాల్లోకి జోక్యం చేసుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. అంతకంటే టిడిపి కండువాలు కప్పుకుంటే మంచిదన్నారు.టిప్పు సుల్తాన్ మైదానంలోని వక్ఫ్ ఆస్తుల ద్వారా ఇప్పటి వరకు రూ.2.20 కోట్లు వసూలు చేశారని ఆ నిధులన్నీ ఎక్కడికి వెళ్లాయని సూటిగా ప్రశ్నించారు.మదర్సాలు,ముస్లిం మైనార్టీ స్మశాన వాటికలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు.ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం వక్ఫ్ భూమిలో ఏవన్ అనే వ్యాపారులకు కొంత స్థలం కేటాయించడంలో అక్కడ షెడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు.ఇందుకు వక్ఫ్ అనుమతిగానే మున్సిపాలిటీ వారి అనుమతి గానీ లేదన్నారు.తాము దానిపై మాట్లాడుతుంటే టిడిపి నాయకులు గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్లు వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు.మదనపల్లిలో 40 వేల మంది ముస్లిం జనాభా ఉంటే పూర్వీకుల నుండి టిప్పు సుల్తాన్ మైదానం ముస్లిం ఆస్తిగా ఉందన్నారు.దానిని కాపాడాలని తాము ప్రయత్నిస్తుంటే టిడిపి మైనార్టీ నేతలు మమ్మల్ని హెచ్చరించడం విడ్డూరంగా ఉందన్నారు.అంతేకాకుండా మసీదు భూములు ఆక్రమించుకుంటున్నాడని చెబుతున్న శంకర్ రెడ్డిపై డీఎస్పీకి ముందుగా ఫిర్యాదు చేసింది తామేనని గుర్తుచేశారు.వక్ఫ్ భూములను ఎవరైనా ఆక్రమించాలని చూస్తే అడ్డుకోవడానికి తమతోపాటు వందలాది మంది ముస్లింలు అడ్డుకునేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు.ఇప్పటికైనా టిడిపి మైనార్టీ నాయకులు ఇతరులపై ఆరోపణలు చేయడం మాని వక్ఫ్ ఆస్తులకు పరిరక్షణకు కృషి చేయాలని హితవు పలికారు.

# శంకర్‌పల్లి మున్సిపాల్టీలో ఓటర్ల ఉత్సాహం

## 77.09 శాతం పోలింగ్

**శంకర్‌పల్లి: ఫిబ్రవరి 11: (మన సాక్షి):**





శంకర్‌పల్లి మున్సిపాల్టీ ఎన్నికల్లో ఓటర్లు గట్టి రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం ఐదు గంటలు ముగిసే వరకు అన్ని వార్డులలో మొత్తం 21401 ఓటర్లకు గాను పురుషులు 10551, మహిళలు 10850 ఓటు హక్కును వినియోగించుకోగా.. 16465 ఓట్లు పోలయ్యాయి. 77.09 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద కనిపించిన ఓటర్ల రద్దీ, మధ్యాహ్నం తర్వాత మరింత వేగం అందుకుని ప్రజాస్వామ్య బాధ్యతను సీరియస్‌గా స్వీకరించిన సంకేతాలను ఇచ్చింది.

మహిళలు, యువత, వృద్ధులు పెద్ద సంఖ్యలో క్యూలలో నిలబడి ఓటు హక్కును వినియోగించడం ఈ ఎన్నికల తీవ్రతను ప్రతిబింబిస్తోంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టగా, ఎన్నికల సిబ్బంది పర్యవేక్షణలో పోలింగ్ క్రమబద్ధంగా కొనసాగింది. 15 వార్డులకు 57 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అధికార పార్టీ కాంగ్రెస్ కు బిఆర్ఎస్, బిజెపి, ఇండిపెండెంట్ అభ్యర్థులు గట్టి పోటీ ఇచ్చారు. 13వ తేదీన భవితవ్యం తేలనుంది.

# సింహాచలం దేవాలయ ఈవో వెంకట్రావుకు మరకత శివాలయానికి ఆహ్వానం

**శంకర్‌పల్లి: ఫిబ్రవరి 11:(మన సాక్షి):**



శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామంలో వెలసిన అష్టమ మోక్షపురిగా ప్రసిద్ధి చెందుతోన్న చాళుక్య రాజుల కాలం 11వ శతాబ్దపు శ్రీ రాజ రాజేశ్వరి సమేత బ్రహ్మసూత్ర మరకత శివలింగేశ్వర దివ్యక్షేత్రమ్ ప్రచార కమిటీ ఛైర్మన్ దయాకర రాజు స్వామి బుధవారం ఆంధ్రప్రదేశ్ లో ప్రసిద్ధిగాంచిన సింహాచలం దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జె వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిసి, ఆయనను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. అనంతరం ఈవో మరకత లింగేశ్వర స్వామి 2026 క్యాలెండర్ ను ఆవిష్కరించారు. హైదరాబాద్ వచ్చినప్పుడు తప్పనిసరిగా ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటానని ఈవో తెలిపినట్టు దయాకర్ రాజు చెప్పారు. కార్యక్రమంలో డబ్బింగ్ ఆర్టిస్ట్, రైటర్ కృష్ణవేణి, స్వర్గీయ సినీ నటుడు మల్లికార్జున రావు కుమారుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మదనపల్లెలో అన్నదానం

**మదనపల్లి, ఫిబ్రవరి 11, మన సాక్షి :**



జనసేన పార్టీ రాష్ట్ర చేనేత వికాస విభాగం ఛైర్మన్, ఏపీ మెడికల్ సర్వీసెస్ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు బుధవారం మదనపల్లెలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నీరుగుట్టువారి పల్లె మార్కెట్ యార్డ్ వద్ద పేదలకు భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పవన్ కళ్యాణ్ ఆశయాల సాధనే లక్ష్యంగా, ప్రజలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. జనసేన పార్టీ నాయకులు బండి మనోహర్, అడపా సురేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది ప్రజలు, కూలీలు, జనసైనికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి, చేనేత కార్మికుల అభ్యున్నతికి శ్రీనివాసరావు చేస్తున్న కృషి స్ఫూర్తిదాయకమన్నారు. మెడికల్ సర్వీసెస్ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు జన్మదిన వేడుకలు బుధవారం మదనపల్లెలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నీరుగుట్టువారి పల్లె మార్కెట్ యార్డ్ వద్ద పేదలకు భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పవన్ కళ్యాణ్ గారి ఆశయాల సాధనే లక్ష్యంగా, ప్రజలకు అండగా ఉండాలనే ఉద్దేశంతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. జనసేన పార్టీ నాయకులు బండి మనోహర్, అడపా సురేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది ప్రజలు, కూలీలు, జనసైనికులు పాల్గొన్నారు.

# స్మశాన వాటికను సందర్శించిన తాజా మాజీ కార్పొరేటర్

**శేరిలింగంపల్లి 11 ఫిబ్రవరి మన సాక్షి**



శేరిలింగంపల్లి నియోజక వర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఖాజాగూడలో గల మాల సంఘం స్మశాన వాటికను తాజా మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా స్మశాన వాటికలో ఉన్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్డు, ప్రహరీ గోడ, బోర్‌వెల్ మరమ్మతులు, స్నానపు గదుల ఏర్పాటు, బర్నింగ్ పాయింట్ నిర్మాణం, సరిపడా లైటింగ్, మెయిన్ గేట్ నిర్మాణం వంటి మౌలిక వసతులు అత్యవసరంగా అవసరమని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైకుంఠధామం ప్రతి మనిషి జీవితంలో గౌరవప్రదమైన చివరి మజిలీ. అలాంటి పవిత్ర స్థలంలో మౌలిక వసతుల కొరత ఉండకూడదు. అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించడం మా బాధ్యత" అని పేర్కొన్నారు.మాల సంఘం స్మశాన వాటిక అభివృద్ధి కోసం స్నానపు గదుల నిర్మాణం, బోర్‌వెల్ మరమ్మతులు, సీసీ రోడ్డు, ప్రహరీ గోడ, బర్నింగ్ పాయింట్ ఏర్పాటు, లైటింగ్, మెయిన్ గేట్ నిర్మాణం, బెంచీల ఏర్పాటు, పిచ్చి చెట్ల తొలగింపు, శుభ్రత పనులు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు తక్షణమే నిధులు కేటాయించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గచ్చిబౌలి డివిజన్‌లోని అన్ని స్మశాన వాటికల అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని దశలవారీగా మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ నిఖిల్, సీనియర్ నాయకులు ఈశ్వరయ్య, కిషోర్, అరుణ్ గౌడ్, సుమన్, వర్క్ ఇన్స్పెక్టర్ బిక్షపతి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# వాళీశ్వరస్వామి విగ్రహాలను కొండ పైకి తరలింపు



**రామసముద్రం, పిబ్రవరి 11మన సాక్షి**

అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం, ఆర్. నడింపల్లె గ్రామ పంచాయతీ, బల్లసముద్రం గ్రామ సమీపాన కొండ పై వెలిసిన వందల ఏళ్ల నాటి చరిత్ర కలిగిన శ్రీ వాళీశ్వర స్వామి ఆలయం నందు మహా శివరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం నుండి ఈనెల 20వ తేదీ వరకు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉత్సవ విగ్రహాలను దేవాదాయశాఖ అధికారులు,గ్రామస్థుల ఆధీనంలో నుంచి స్వాదీనం చేసుకుని రెవిన్యూ, పోలీస్, దేవాదాయ శాఖ అధికారుల బందో బస్తు మధ్య కొండ పై ఉన్న ఆలయానికి ట్రాక్టర్ సహాయం తో ఆలయ ప్రధాన అర్చకులు లోఖనా ధదీక్షితులు తరలించారు.జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ మాట్లాడుతూ శ్రీ వాళీశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవ వేడుకలను తిలకించడానికి మూడు రాష్ట్రాల నుండి భక్తులు వస్తున్న సందర్భంగా వారికి ఎలాంటి అసౌకర్యం కలగ కుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని గ్రామ స్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామసముద్రం ఎస్సై ఉమామహేశ్వర్ రెడ్డి, నిమ్మనపల్లె ఎస్సై రామకృష్ణ, ఈవో రమణారెడ్డి,మదనపల్లి ఈవో బాలంకన్న, శశి కుమార్, రాజశేఖర్, బుక్కే నాయక్, రెవిన్యూ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి భక్తులు సహకారం అవసరం

**మేడ్చల్ మల్కాజిగిరి ఫిబ్రవరి 11 మన సాక్షి**



కానాజిగూడ లోని మరకత శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారికి బుధవారం సందర్భంగా సుప్రభాత సేవ, ప్రత్యేక హోమాలు నిర్వహించిన ఆలయ వ్యవస్థాపకులు, కార్యనిర్వాహకులు, డాక్టర్ మోత్కూరు సత్యనారాయణ శాస్త్రి. ప్రత్యేక అలంకరణతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం ఆలయ ప్రాంగణంలో తీర్థ ప్రసాదాలు అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి స్థల సేకరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, తమవంతుగా భక్తుల సహకారం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.

# శ్రీశైలం బయలుదేరిన శివ స్వాములు

**కుత్బుల్లాపూర్ ఫిబ్రవరి 11 ( మన సాక్షి)**





కుత్బుల్లాపూర్ నియోజక వర్గం, గాజులరామారం సర్కిల్ పరిధిలో చిన్న శ్రీశైలం గా పేరుగాంచిన శ్రీ నల్లగుట్ట శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో మండల కాలంగా శివ స్వాములు భక్తిశ్రద్ధలతో, నియమ నిష్టలతో శివదీక్ష చేపట్టి శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ శ్రీశైలం మల్లికార్జున స్వామి వారికి ముడుపులను ముట్టజెప్పి దీక్ష విరమించేందుకు బుధవారం ఆలయ కమిటీ ఛైర్మన్, గురుస్వామి సోమేశ్ యాదవ్ సమక్షంలో సుమారు 120 మంది శివ స్వాములు ఇరుముడులు కట్టుకొని శ్రీ శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానానికి యాత్రగా బయలుదేరు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ హాజరయ్యారు.

ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి అనంతరం సోమేశ్ గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి కట్టే కార్యక్రమం నిర్వహించారు. "హర హర మహాదేవ", "ఓం నమః శివాయ" నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.ఈ సందర్భంగా గురు స్వామి సోమేశ్ యాదవ్ మాట్లాడుతూ, శివ భక్తులు నియమ నిష్టలతో దీక్ష చేపట్టి ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. గత 25 సంవత్సరాలుగా శివ స్వాములు మాలలు ధరించి ఇక్కడినుండి వెళ్లి శ్రీశైల మల్లన్నకు ఇరుముడులు సమర్పించడం ఆనవాయుతుగా కొనసాగుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం ఇదే విధంగా శివ స్వాములు సమూహంగా శ్రీశైలం యాత్రకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. శ్రీ శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఆశీస్సులతో ఈ యాత్ర విజయవంతంగా సాగాలని భక్తులు ఆకాంక్షించారు. అనంతరం బిఆర్ఎస్ నాయకులు రుద్ర.అశోక్, పుప్పాల. భాస్కర్, పోలె.శ్రీకాంత్ సహకారంతో ఏర్పాటు చేసిన అన్న ప్రసాదాలను భక్తులు,శివ స్వాములు స్వీకరించారు. యాత్రకు బయలుదేరిన శివ స్వాములకు కుటుంబ సభ్యులు, భక్తులు పూలమాలలు వేసి ఆశీర్వాదాలు అందించి వీడ్కోలు పలికారు. భక్తులు మరియు శివ స్వాములు వివిధ వాహనాలలో శ్రీశైల క్షేత్రానికి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో భక్తులు, శివ స్వాములు, వివిధ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆనంద్ బాగ్ శ్రీవారి హుండీ ఆదాయం లెక్కింపు

**మేడ్చల్ మల్కాజిగిరి ఫిబ్రవరి 11 మనసాక్షి**



ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం లెక్కింపు మల్కాజ్ గిరి ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం లో స్వామి వారికి భక్తులు హుండీలోసమర్పించిన కానుకలను బుధవారం ఎండోమెంట్ పర్యవేక్షణ అధికారి మోహన్ రెడ్డి సమక్షం లో లెక్కించగా 5,88,058( ఐదు లక్షల ఎనభై ఎనిమిది వేల యాభై ఎనిమిది రూపాయలు) 49 రోజులకు గాను ఆదాయం వచ్చింది అని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎ బి రవీంద్ర రెడ్డి తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ ప్రధాన అర్చకులు ముడుంబై వేంకట రమణా చార్యులు, అర్చకులు తులసి వెంకట రమణా చార్యులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ సంద్ర సుధాకర్, అభివృద్ధి కమిటీ సభ్యులు సానాధి శంకర్, హేమంత్ కుమార్, రత్నాకర్ రావ్, అనిత, రవీందర్ రెడ్డి, గణేష్ , మాజీ చైర్మన్ రాందాస్ సంతోష్, భక్తులు రత్నమాల, రత్న కుమారి, ప్రసన్న, లక్ష్మణ్, సుబ్బారావు, టి మధుసూదన్ రావు, ఫణికుమారి, కె వి ఎస్ ప్రసాద్, లక్ష్మీ, రవి కుమార్, నాగరాజ్, పద్మజ, వెంకటేశ్వర్లు, అశోక్, సందీప్ గౌడ్, సంజయ్ కుమార్, నిర్మల తదితర భక్తులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో ప్రశాంతంగా పోలింగ్














**మిర్యాలగూడ ఫిబ్రవరి 11, మన సాక్షి,**

నల్గొండ జిల్లా మిర్యాలగూడ మున్సిపాలిటీలో బుధవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పోలింగ్ స్టేషన్లను ఎప్పటికప్పుడు పరిశీలించారు.

మిర్యాలగూడ మున్సిపాలిటీలో 48 వార్డు లుండగా 93,020 ఓటర్లు ఉన్నారు. వారిలో 45,128 మంది పురుషులు, 47,878 మంది మహిళలు, 14 మంది ఇతర ఓటర్లు ఉన్నారు.కాగా 77.44% మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా 34,098 మంది పురుషులు, 37,123 మంది మహిళలు, ఇతరులు 5 మంది మొత్తం 72,036 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

**తగ్గిన పోలింగ్ :**

నల్గొండ జిల్లా మిర్యాలగూడ మున్సిపాలిటీలో పోలింగ్ శాతం గతం కంటే తగ్గింది. అధికారులు, స్వచ్ఛంద సేవ సంస్థలు ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రచారం చేసినప్పటికీ కూడా పట్టణ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవడంలో వెనుకబడి ఉన్నారు. 2020 మున్సిపల్ ఎన్నికల్లో మిర్యాలగూడ మున్సిపాలిటీలో 79.31% పోలింగ్ కాగా ప్రస్తుతం 77.44% మాత్రమే పోలింగ్ జరిగింది.

# ఓటు హక్కు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే

**మిర్యాలగూడ, ఫిబ్రవరి 11, మన సాక్షి :**



నల్గొండ జిల్లా మిర్యాలగూడలో మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బుధవారం తమ ఓటు హక్కును మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కరరావు, బీఆర్ఎస్ యువ నేత నల్లమోతు సిద్ధార్థ కుటుంబ సభ్యులు వినియోగించుకున్నారు. స్థానిక బాపూజీ నగర్‌లోని వడ్డెర సంఘ భవనంలో ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు.పట్టణ ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు పిలుపునిచ్చారు

# స్వర్ణాంధ్ర లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం

### అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లుగా ప్రగతి పయనం

### 19 నెలల కాలంలోనే రాష్ట్రాన్ని గాడిలో పెట్టగలిగాం

### 2019 తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు

### విద్యుత్, సాగునీటి పారుదల రంగాల్లో తిరోగమనం

### వ్యవస్థల నిర్వీర్యంతో కుంటుపడిన అభివృద్ధి రంగం

### ఉభయ సభలను ఉద్దేశించిన గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం

అమరావతి,ఫిబ్రవరి11: రాష్ట్ర విభజన తర్వాత ఏపీ ఎన్నో కీలక మార్పులు, పరిణామాలను చవిచూసిందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. పరిమిత వనరులు ఉన్నప్పటికీ దీర్ఘకాలిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేసిందని చెప్పారు. 2019లో జరిగిన ప్రభుత్వ మార్పు రాష్ట్ర పురోగతికి విఘాతం కలిగించిందన్నారు. ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా బుధవారం ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. ప్రజా సంక్షేమం అనే కోణంలోనే.. ప్రభుత్వం ప్రతీ నిర్ణయాన్ని తీసుకుంటోందని తెలిపారు. ఏడాదికి రూ.33వేల కోట్లతో సూపర్ సిక్స్ సహా ఇతర డీబీటీ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. 63.12 లక్షల మందికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా ప్రయోజనం చేకూరుతోంద న్నారు. 66 లక్షలకు పైగా విద్యార్థులకు తల్లికి వందనం ద్వారా ఆర్థిక సాయం అందుతోందని గవర్నర్ వెల్లడించారు. 2019 తర్వాత వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు తలెత్తాయి. రాష్ట్ర అభివృద్ధి స్తంభించింది. ఆర్థిక ఒత్తిడి తీవ్రమైంది. వ్యవస్థలు విధ్వంసమయ్యాయి. మౌలిక సదుపాయాలు, విద్యుత్, సాగు నీటి పారుదల రంగాలు తీవ్ర తిరోగమనం చవిచూశాయి. గత చేదు అనుభవాలతో విసిగి వేశారిన ప్రజలు.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారు. గత 19 నెలలుగా మా ప్రభుత్వం పునరుద్ధరణ దశ నుంచి ప్రగతి పథం వైపు పయనిస్తోంది. సూపర్-6, ఇతర సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అభివృద్ధి కార్యకలాపాలను పునఃప్రారంభించడంపై ప్రధానంగా దృష్టి పెట్టాం. విధానాలు, వ్యవస్థలు, వ్యయ ప్రాధాన్యాలలో కీలక సవరణలు చేశాం. 7 శ్వేతపత్రాల విడుదల ద్వారా పారదర్శకతకు పెద్దపీట వేశాం. సంక్షేమాన్ని అభివృద్ధితో సమతుల్యం చేయడానికి పది సూత్రాలు రూపొందించాం. సంపదను సృష్టించే ప్రగతి చక్రాన్ని నిర్మించడమే దీని లక్ష్యం. స్వర్ణాంధ్ర విజన్ ఒక స్పష్టమైన ఆర్థిక మార్గాన్ని నిర్దేశిరచిందని గవర్నర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అందుతోందని గవర్నర్ తెలిపారు. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేల చొప్పున 46.86 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరుతోందన్నారు. దీపం 2.0 పథకం ద్వారా 1.08 కోట్ల మంది పేద కుటుంబాలకు ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని పేర్కొన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టుల భర్తీతో పాటు 5,757 మంది కానిస్టేబుళ్ల రిక్రూట్మెంట్ కూడా ప్రభుత్వం పూర్తి చేసిందని వివరించారు. మత్స్యకార సేవలో పథకం ద్వారా 1.2 లక్షల మందికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందుతోందని తెలిపారు. లక్ష మందికి పైగా హ్యాండ్లూమ్, పవర్‌లూమ్‌లపై ఆధారపడిన చేనేత కుటుంబాలకు 200, 500 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందిస్తోందని గవర్నర్ చెప్పారు. విభజన సమస్యలతో పాటు వారసత్వంగా వచ్చిన ఆర్థిక నష్టాలతో ప్రభుత్వం పాలన ప్రారంభించిందని అబ్దుల్ నజీర్ చెప్పుకొచ్చారు. విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గత పాలకులు ధ్వంసం చేశారన్నారు. వ్యవస్థలను నిర్వీర్యం చేయడంతో అభివృద్ధి ఆగిపోయిందని.. ఆర్థికపరమైన ఇబ్బందులు పెరిగాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా గత పాలకులు పాలించారని.. 22ఏ అధికరణను దుర్వినియోగం చేశారన్నారు. మౌలిక వసతులైన విద్యుత్, సాగునీరు, రహదారులు లాంటి రంగాల్లో అభివృద్ధి కుంటుపడిందని గవర్నర్ తెలిపారు. 2024లో రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేసే బాధ్యతను ప్రజలు కూటమికి అప్పజెప్పారని.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో ప్రభుత్వ పాలన అద్భుతంగా సాగుతోందని వెల్లడించారు. 19 నెలల కాలంలోనే రాష్ట్రాన్ని పునర్నిర్మించి గాడిలో పెట్టిందన్నారు. రాష్ట్రంలో సూపర్ సిక్స్ సహా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రీస్టార్ట్ అయ్యాయని తెలిపారు. తొలి 9 నెలల కాలంలో దిద్దుబాటు చర్యలు, పాలసీలు, వ్యవస్థల పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. ఏడు శ్వేతపత్రాలను విడుదల చేసి పారదర్శకమైన పాలనను కూటమి ప్రభుత్వం చేపడుతోందని వివరించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో పాలన సాగిస్తోందన్నారు. పది సూత్రాలను నిర్దేశిరచుకుని.. ప్రజలకు సుపరిపాలన అందించేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని సమతూకంగా చేసుకుని ప్రభుత్వ పాలన సాగుతోందని అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. జీరో పావర్టీ లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని గవర్నర్ వెల్లడించారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్మెంట్ సిస్టమ్ ద్వారా ప్రతీ కుటుంబానికి అవసరమైన ప్రయోజనాలను అందిస్తున్నామన్నారు. త్వరలో ఫ్యామిలీ కార్డును అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. పీ4 ద్వారా పేద, ధనిక వర్గాల మధ్య తారతమ్యాలను తగ్గించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎవరూ ఆకలితో ఉండకూడదనే సూత్రంతో 113 నియోజకవర్గాల్లో 205 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసిందని చెప్పారు. త్వరలో మిగిలిన నియోజకవర్గాల్లోనూ గ్రామీణ అన్నా క్యాంటీన్లను ప్రభుత్వం ఏర్పాటు చేయనుందని గవర్నర్ నజీర్ వెల్లడించారు. అందరికీ ఇల్లు.. అనే లక్ష్యంతో గృహ నిర్మాణ పథకాన్ని ప్రభుత్వం చేపడుతోందన్నారు గవర్నర్. ఎస్సీ వర్గీకరణ ద్వారా అన్ని వర్గాలకూ న్యాయం జరిగేలా చేసిందన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పుకొచ్చారు. బీసీల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం.. వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా బీసీ వర్గాలను బలోపేతం చేసేందుకు కార్యాచరణ చేపట్టిందన్నారు. మైనారిటీలకు భద్రత, వారికి అభివృద్ధిలో భాగస్వామ్యం, విద్య, ఆర్థిక సహకారంతో మేలు చేకూరుస్తోందని తెలిపారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ స్పష్టం చేశారు.రాష్ట్రం ఐటీ, క్వాంటమ్ కంప్యూటింగ్ లాంటి రంగాల్లో దూసుకెళ్తోందని గవర్నర్ పేర్కొన్నారు. ప్రముఖ పరిశ్రమల భాగస్వామ్యంతో రాష్ట్రానికి అంతర్జాతీయ గుర్తింపు వస్తోందన్నారు. అంతర్జాతీయ సంస్థలు.. ఏపీని పెట్టుబడులు, నాలెడ్జ్ ఎకానమీకి గమ్యస్థానంగా ఎంచుకున్నాయని తెలిపారు. టెక్నాలజీని అందిపుచ్చుకోవటం ద్వారా యువతకు భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేలా ప్రణాళికతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందని గవర్నర్ వివరించారు. ప్రజలకు వైద్య ఖర్చులు తగ్గించేలా.. సంజీవని కార్యక్రమం ద్వారా ప్రజల ఆరోగ్య భద్రతను బలోపేతం చేస్తోందన్నారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రాష్ట్రంలో ప్రజలందరికీ ఉచిత ఆరోగ్య బీమా కల్పించేందుకు కృషి చేస్తోందని గవర్నర్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ వ్యక్తికి రూ.2.5 లక్షల వరకూ సమగ్ర ఆరోగ్య బీమా కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని అందుబాటులోకి తెస్తోందన్నారు. 1.43 కోట్ల పేద కుటుంబాలకు రూ.25 లక్షల వరకు నగదురహిత వైద్యం అందుబాటులోకి తీసుకువస్తోందని అన్నారు. క్యాన్సర్ సహా ఇతర ఖరీదైన చికిత్సలకు ఎలాంటి పరిమితి లేకుండా ప్రభుత్వం ఈ బృహత్ పథకాన్ని చేపడుతోందని చెప్పారు గవర్నర్. వృద్ధుల సంఖ్య పెరగడం వివిధ దేశాలకు సవాల్‌గా మారిందని.. దీనిపై సరైన విధానాన్ని రూపొందించాలని సభను కోరుతున్నట్లు గవర్నర్ తెలిపారు. అక్రమ మద్యం తయారీ నుంచి విముక్తి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని.. గంజాయి నిర్మూలనలో పురోగతి సాధించిందన్నారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించి మెరుగైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. 'వీబీ జీ రామ్ జీ' పథకం ద్వారా ఉపాధి రోజులను 100 నుంచి 125 రోజులకు పెంచారన్నారు. అభివృద్ధి వ్యూహంలో మహిళలే కేంద్ర బిందువులని.. ఆర్థిక భాగస్వాములు, స్వయం పేరుతో డ్వాక్రా మహిళలు రూపొందించిన ఉత్పత్తులకు బ్రాండింగ్ చేస్తోందన్నారు. ఏడాదికి లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని.. వచ్చే ఏడాది 5 లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చాలనే లక్ష్యాన్ని నిర్దేశిరచుకుందని తెలిపారు. అంగన్ వాడీలను బలోపేతం చేసి.. గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తోందన్నారు.

# వైకాపా కుట్రలపై అప్రమత్తంగా ఉండాలి

### మతాన్ని రాజకీయంగా వాడుకోవాలనే ఎత్తుగడ

### కూటమి నేతలకు పవన్ కళ్యాణ్ హెచ్చరిక

అమరావతి,ఫిబ్రవరి11: వైకాపా కుట్రల పట్ల తెదేపా, జనసేన, భాజపా సభ్యులు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు. అసెంబ్లీ వాయిదా పడిన అనంతరం కమిటీ హాల్‌లో సీఎం చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశం అయ్యింది. అసెంబ్లీ కమ్యూనిటీ హాల్లో జరిగిన ఈ సమావేశానికి మూడు పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడారు. వైకాపా విధ్వంస కుట్రలను ఈ సందర్భంగా పవన్ లేవనెత్తారు. మతాన్ని రాజకీయంగా వాడుకోవాలని వైకాపా చూస్తోందన్నారు. సభలో ఎంతసేపు మాట్లాడామనే దానికంటే.. కంటెంట్ ఎంత మాట్లాడామనేదే ముఖ్యమని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. దావోస్‌లో సీఎం, తాను కలిసే ప్రతి సంస్థపై ముందస్తుగా కసరత్తు చేశామని చెప్పారు. 7 నిమిషాల్లో ప్రతి అంశాన్ని సీఎం వివరించి సమావేశాలను ముగించేవారన్నారు. తక్కువ సమయంలో ఎక్కువమంది పారిశ్రామికవేత్తలను సీఎం కలవగలిగారని చెప్పారు. ఆయన స్ఫూర్తితో సభ్యులు కూడా సభలో ఎక్కువ విషయం చెప్పగలగాలన్నారు. వైసీపీ.. హిందూ మతాన్ని రాజకీయంగా వాడుకోవాలని చూస్తోందని పవన్ కల్యాణ్ ఆరోపించారు. దక్షిణ భారతదేశంలో ప్రతి ఒక్కరూ మతాన్ని గౌరవిస్తారని తెలిపారు. అవైసీపీ నేతలు చేసే విధ్వంస కుట్రలను సమావేశంలో డిప్యూటీ సీఎం లేవనెత్తారు. మన ప్రభుత్వంపై జగన్ అండ్ కో చేసే కుట్రలపై మూడు పార్టీల సభ్యులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని పవన్ దిశానిర్దేశం చేశారు.ఏపీ అసెంబ్లీలో సభ్యులు ఎంతసేపు మాట్లాడామనే దానికంటే ఏం మాట్లాడమనేది ముఖ్యమని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

# సాహిత్యమే సమాజానికి చైతన్య స్ఫూర్తి



**శేరిలింగంపల్లి 11ఫిబ్రవరి మన సాక్షి**

సాహిత్యమే సమాజ చైతన్య స్ఫూర్తియని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి జగదీశ్వర్ గౌడ్ అన్నారు .శేరిలింగంపల్లి రచయితల సంఘం ఆధ్వర్యంలో చందానగర్ లోని సరస్వతి విద్యా మందిర్ లో శేరసం ద్వితీయ వార్షికోత్సవం, కవి సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర గనుల శాఖ విశ్రాంత డైరెక్టర్ డాక్టర్ వి డి రాజగోపాల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ హాజరై ప్రసంగించారు.. సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో కవుల పాత్ర కీలకమైనదని అన్నారు. జ్ఞానపీఠ అవార్డు గ్రహీతలైన విశ్వనాథ సత్యనారాయణ, సి.నారాయణరెడ్డి, రావూరి భరద్వాజ్ వంటి ప్రముఖులు నేటి కవులకు ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. ఆస్తులు కూడబెట్టినా రాని మానసిక ప్రశాంతత మంచి సాహిత్య గ్రంధ పటనం ద్వారా సిద్దిస్తుందన్నారు. తెలియని సంగతులను అక్షరం నేర్పిస్తుందని ఆయన తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కవులు ,కళాకారులను ఒక వేదికపైకి తీసుకువచ్చి తెలుగు భాషా, సాహిత్యాల మనుగడకు కృషి చేస్తున్న శేరిలింగంపల్లి రచయితల సంఘం నిర్వాహకులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు . అనంతరం రాష్ట్ర గనుల శాఖ విశ్రాంత డైరెక్టర్ వీడి రాజగోపాల్ ,ప్రముఖ కవి, విమర్శకులు గంటా మనోహర్ రెడ్డి ,రామకృష్ణ చంద్రమౌళి ,అంజని కుమారి,టి రామస్వామి యాదవ్ లు మాట్లాడారు.మనిషిని కదిలించేది ,నడిపించేది కవిత్వమేనని అన్నారు. కవులు అనాధికార శాసనకర్తలని వారు పేర్కొన్నారు. సందర్భంగా ఇస్లామిక్ సాహితీ వేదిక అబ్దుల్ రషీద్ సంకలన కర్తగా ప్రచురించిన కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. సభా కార్యక్రమానికి శేరిలింగంపల్లి రచయితల సంఘం అధ్యక్షులు మోటూరి నారాయణ రావు సమన్వయ కర్తగా వ్యవహరించగా శేరసం ఉపాధ్యక్షులు జేవీ కుమార్ చేపూరి, ప్రధాన కార్యదర్శి రవీందర్ బాబు అరవా, భీమా శ్రీనివాస రావు, విశ్వనాథరెడ్డి,చంద్రశేఖర్ రావులు కవి సమ్మేళనాలను నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సునీతా రెడ్డి, ప్రీతం, కట్ల చంద్రశేఖర్ రెడ్డి, శేఖర్ ముదిరాజ్, శేరసం కవులు డాక్టర్ రమ్య స్వరూప్,కొలచన విజయ భారతి తదితరులు పాల్గొన్నారు.

# 11 వ తేదీ..11మంది..11 నిముషాలు

### వైకాపా హాజరుపై స్పీకర్ ఛలోక్తులు

**అమరావతి,ఫిబ్రవరి11:** ఏపీ అసెంబ్లీ లాబీలో మీడియాతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు సరదా వ్యాఖ్యలు చేశారు. వైకాపా సభ్యులు గవర్నర్ ప్రసంగం సందర్భంగా సభకు హాజరై కాసేపు నిరసన తెలిపి వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో స్పీకర్ స్పందిస్తూ 11వ తేదీన 11 మంది 11 నిమిషాలు ఉండి వెళ్లిపోయారు!.. అంతకుమించి ఎక్కువ సమయం లేరుగా..! అని వ్యాఖ్యానించారు. సభ్యులు సభా సంప్రదాయాలను పాటిస్తే మంచిదని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు బుధవారం ఉదయం 10:00 గంటలకు ప్రారంభమయ్యాయి.

సభ ఆరంభమైన కాసేపటికే వైసీపీ సభ్యులు అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహా వైసీపీ ఎమ్మెల్యేలంతా 11 నిమిషాల వ్యవధిలోనే అసెంబ్లీ నుంచి బయటకు వెళ్లిపోయారు. తిరుమల లడ్డూ గోవిందా, గోవిందా అంటూ లాబీల్లో నినాదాలు చేశారు. ఈ సమయంలో జై జగన్ అనే నినాదాలని వైసీపీ సభ్యులు చేయగా.. నినాదాలు చేయొద్దని జగన్ వారించినట్లు తెలుస్తోంది. జగన్ చెప్పిన వినకుండా మరింత బిగ్గరగా సభ్యులు అరిచారు. సరిగ్గా 10 గంటలకు అసెంబ్లీలోకి వైసీపీ సభ్యులు వెళ్లి.. కేవలం 11 నిమిషాల పాటు నినాదాలు చేసి వైసీపీ సభ్యులు బయటకు వచ్చారు.

